# వ్యవసాయం

## నష్టాల బారి నుండి లాభాల బాటకి



డా॥ జయప్రకాష్ నారాయణ్





# వ్యవసాయం

## నష్టాలబారి నుండి లాభాల బాటకి

# AGRICULTURE

## From  Poverty To Prosperity

-డా॥ జయప్రకాష్ నారాయణ్

# వ్యవసాయం

## నష్టాలబారి నుండి లాభాల బాటకి

విషయసూచిక ............

1. వ్యవసాయం-పేదరికం నుంచి ఆదాయానికి............ 3

2. జి.యం విత్తనాలు - రైతు ప్రయోజనాలు ................ 23

3. ఎఫ్‌డిఐ అంటే భయం ఎందుకు? ............................ 30

4. కొన్ని ముఖ్యమైన గణాంకాలు ................................ 36

వెల : 30/-

**FDR and Lok Satta publication**

**2013, Hyderabad**

**H.No. 806, 8th Floor, Srinivasa Towers,**
**Beside ITC Kakatiya Hotel, Begumpet, Hyd-16**
**Ph: +91-40-2341 9949, Fax: +91-40-2341 9948**
**Email : info@fdrindia.org**
**Web : www.fdrindia.org**

© All rights reserved

# వ్యవసాయం

## నష్టాలబారి నుండి లాభాల బాటకి

శ్రీ ఎన్.జి రంగాకు ఆయన 112వ జయంతి సందర్భంగా నివాళులర్పించేందుకు ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో (నవంబర్ 7, 2012న) పాల్గొనటాన్ని నేను ఒక గౌరవంగా భావిస్తున్నాను. ఆచార్య ఎన్.జి రంగా ఎన్నో లక్ష్యాల కోసం పోరాడారు. అనేక సంస్థల్ని నిర్మించారు. లక్షలాది హృదయాలలో చెరగని ముద్ర వేశారు. రైతులు, కౌలుదారులు, వ్యవసాయ కూలీలు, చేనేతకారులు, దళితులు– ఇలా మన గ్రామీణ ప్రాంతాలలో తరతరాలుగా పేదరికం కోరల్లో నలిగిపోతున్న ప్రతిరంగంవారి కోసం ఆయన పనిచేశారు.

1930లో తొలిసారిగా సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి ఎన్నికైన నాటి నుంచి, 1991లో పార్లమెంటు సభ్యునిగా వైదొలిగేంత వరకూ 60ఏళ్ల పాటు ఆచార్య రంగా ప్రజాజీవితం కొనసాగింది. ఆయన స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించటం, మొదటి రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొనటం కన్నా దేశ నిర్మాణానికి, గ్రామీణ భారత ఆర్థిక విముక్తికి చేసిన కృషి ఎన్నో రెట్లు విలువైనది.

ఎన్ని రకాలుగా చూసినా, భారతదేశంలో రైతు ఉద్యమ చరిత్రను రంగా జీవితం



నుంచి వేరు చేయలేం. జమిందారీ రద్దు కోసం పోరాటంలో ఆయన ముందు నిలిచారు. 1959లో నెహ్రూ ప్రతిపాదించిన సమష్టి వ్యవసాయం అనే పెను విధానతప్పిద ప్రయత్నం నుంచి రైతులను, దేశాన్ని కాపాడింది రంగా నాయకత్వమే. ఎటుచూసినా సోషలిజం, సమిష్టివిధానాల పట్ల గుడ్డిగా మద్దతు లభిస్తున్న తరుణంలో వ్యక్తిస్వేచ్ఛకి, ఆస్తి హక్కులకు, పోటీతత్వానికి, లాభాపేక్షకి ఉన్న ప్రాధాన్యతను రంగా స్పష్టంగా అర్థం చేసుకుని నిర్ద్వంద్వంగా తన గళాన్ని వినిపించారు. సోషలిస్టుగా తన జీవితాన్ని ప్రారంభించిన రంగా, మానవ స్వభావాన్ని ఎంతో నిశితంగా, లోతుగా అర్థం చేసుకున్నారు. రాజీలేని స్వేచ్ఛావాదిగా, మానవతావాదిగా రూపుదిద్దుకున్నారు.

సోవియెట్ నమూనా ఆకర్షణకు లోనైన నెహ్రూ సమిష్టి సాగు అమలు కోసం చాలా దూకుడుగానే ప్రయత్నించారు. యాజమాన్య హక్కు, ఆర్థిక ప్రోత్సాహకం లేకుండా సాగు చేయటం వల్ల వ్యవసాయోత్పత్తి దెబ్బతిని ఆహారభద్రతకు ప్రమాదం తలెత్తుతుందని ఆయన గుర్తించలేదు. సోషలిస్టు దైవం కోసం రైతుల ఆస్తిహక్కుల్ని రద్దుచేసి సమిష్టి వ్యవసాయాన్ని పెద్దఎత్తున చేపట్టాలని ఆయన బృహత్ ప్రణాళికే రచించారు. నెహ్రూను వ్యతిరేకించటం అంటే రాజకీయ ఆత్మహత్యే అనే పరిస్థితి ఉన్న ఆరోజులలో తాను వ్యక్తిగతంగా ఎంతో నష్టపోతానని తెలిసినా రంగా సిద్ధపడే నెహ్రూకు వ్యతిరేకంగా సాహసోపేతంగా పోరాడారు. ఈ గొప్ప పోరాట విజయమే మన రైతుల్ని, ఇంకా చెప్పాలంటే మనదేశాన్ని రక్షించింది. మూడు దశాబ్దాల తర్వాత ఆహారరంగంలో సోవియెట్ యూనియన్ ఘోరవైఫల్యమే ఆ దేశ పతనానికి కారణమైంది. మనదేశంలో కూడా, నెహ్రూ తన సమిష్టి వ్యవసాయం కార్యక్రమాన్ని నెగ్గించుకోలేకపోయినా, కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో భారీస్థాయి కేంద్రప్రభుత్వ వ్యవసాయక్షేత్రాలను నిర్వహించే ప్రయత్నం చేశారు. పెద్దఎత్తున మౌలికవసతులు, ప్రభుత్వ సాయం ఉన్నా కూడా ఆ క్షేత్రాలలోని ఉత్పత్తి పొరుగున్న ఉన్న రైతుల భూముల నుంచి వచ్చే ఉత్పత్తితో పోలిస్తే బహుస్వల్పం. ఇప్పటికి కూడా 14 కేంద్ర (ప్రభుత్వ) వ్యవసాయ క్షేత్రాలు తెల్లఏనుగుల్లా, గతకాలపు తప్పిదాలకు చిహ్నాలుగా మిగిలేవున్నాయి.

అదేతీరుగా, ఆస్తి హక్కుల్ని హరించేందుకు నెహ్రూ పార్లమెంటులో రాజ్యాంగానికి 17వ సవరణను ప్రతిపాదించినప్పుడు కూడా మళ్లీ రంగాయే ఎదురునిలిచారు. తన తార్కికతతో, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేస్తూ ఒప్పించే వాదనాపటిమతో

నెహ్రూకఆకాంక్షలకి వ్యతిరేకంగా పార్లమెంటును ఏకం చేశారు. సవరణ వీగిపోయేలా చేశారు. తర్వాత నెహ్రూ మృతి అనంతరం ఆయన గౌరవార్థం ఆ సవరణను పార్లమెంటులో చేశారు. అయితే, గోలక్‌నాథ్ (1967), కేశవానంద్ భారతి (1973) తీర్పులలో, స్వేచ్ఛను, రాజ్యాంగబద్ధతతను, సరైన విధానాల రూపకల్పనకు అనుసరించాల్సిన పద్ధతిని పరిరక్షిస్తూ, మానవ గౌరవంపై, వ్యక్తిగత చొరవపై ఏకపక్ష రాజ్యాంగపంథా దాడుల ప్రభావాన్ని సుప్రీంకోర్టు పరిహరించింది.

రాజాజీ, మినూ మసానీ, రంగా, గౌతు లచ్చన్న, దూరదృష్టి గల వారి సహచరులు తమ కాలం కంటే ఎంతో ముందు జీవించినవారు. వారిలో రైతుల హక్కుల పరిరక్షణకు జరిగిన పోరాట చరిత్రలో రంగా పేరు అగ్రస్థానాన నిలుస్తుంది. అందుకే చివరకు నెహ్రూ కూడా "పార్లమెంటులో రంగాజీ ఉన్నంతవరకూ భారతదేశ రైతులు నిశ్చింతంగా నిద్రపోవచ్చు" అని లోక్‌సభలో ఒప్పుకోవాల్సి వచ్చింది.

రైతులకు న్యాయమైన లాభం కోసం ఈవేళ చేసే ఏ పోరాటమైన రంగా, ఆయన సహచరులు అసంపూర్ణంగా వదిలేసిన దగ్గర్నుంచే మొదలవ్వాలి.

ప్రముఖ పత్రిక ఎకనామిస్ట్ మే, 1991 సంచికలో తాను రాసిన ఓ ప్రామాణిక వ్యాసంలో క్లయివ్ క్రూక్ ఇలా వాదించారు: "భారతదేశ రాజకీయ నేతలు, విధాన నిర్ణేతలు, ప్రణాళికారూపకర్తలు అంతా కలిసికట్టుగా కూర్చుని భారతదేశ వ్యవసాయాన్ని నాశనం చెయ్యాలని కుట్రపన్నినా, ఇప్పుడు చేసిన పనులనే చేసి ఉండేవారు!". సమష్టి వ్యవసాయం, 17వ రాజ్యాంగ సవరణ ఇవి రెండూ తొలిరోజులలో విధానాల రూపకల్పనలో చేసిన కీలక తప్పిదాలు కాగా, వాటిని ఎన్.జి రంగాలాంటి నాయకులతోపాటు కోర్టులు తిప్పికొట్టగలిగాయి. కానీ ఇంకా అనేక ఉక్కునియంత్రణలు, రైతు వ్యతిరేక, పేదల వ్యతిరేక విధానాలు, చర్యలు అడ్డూఆపూ లేకుండా కొనసాగుతూనే ఉన్నాయి. గ్రామీణ ఆర్థికవ్యవస్థను, వ్యవసాయాన్ని నాశనం చేస్తూ భారతదేశ అభివృద్ధిని, సంపదసృష్టిని దెబ్బతీస్తున్నాయి. 1955–56లో వ్యవసాయరంగంలో వున్నవారి తలసరి ఆదాయం రూ.195 మాత్రమే ఉందని, అది వ్యవసాయేతర రంగాలలో ఉన్న వారి ఆదాయం (రూ.485)లో 40శాతం మాత్రమేనని రంగా లెక్కకట్టినట్టు కిలారు పూర్ణచంద్రరావు ఉటంకించారు. వరుస ప్రభుత్వాల తప్పిదాలు, వైఫల్యాల పుణ్యమాని ఈవేళ ఆ ఆదాయపు అంతరం 6 రెట్లుకి పెరిగింది. ఈవేళ కూడా భారతీయులలో

55శాతంమంది తమ జీవనోపాధికి వ్యవసాయం మీదే ఆధాపడుతున్నా మొత్తం స్థూలజాతీయోత్పత్తిలో (జి.డి.పి)లో వారి వాటా కేవలం 15శాతం మాత్రమే ఉంది. ఈ వాటా ఏటా 0.5శాతం చొప్పున తగ్గిపోతోంది. వ్యవసాయం మీద ఆధారపడిన జనాభా సంఖ్య మాత్రం పెద్దగా తగ్గకపోయినా కూడా.

ప్రపంచంలో ఎక్కడైనా వ్యవసాయం ఓ క్లిష్టమైన, నష్టప్రమాదం పొంచివున్న వృత్తి. రైతులు ఎప్పుడూ ప్రకృతి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి వుంటారు. వారి ఆదాయం ఇతర రంగాలలోవారి కంటే తక్కువగా ఉంటుంది. అయినా, వ్యవసాయమే నాగరికతకు పునాది. ఆహారభద్రతనిస్తుంది. పరిశ్రమలకు ముడిసరకుల్ని ఇస్తుంది. రోజురోజుకీ ఇంధన కొరత నెదుర్కొంటున్న ప్రపంచానికి ఇంధన వనరుగా కూడా ఉపయోగపడుతుంది. ఈ అంశాల్ని గుర్తించే ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు వ్యవసాయాన్ని మూడు విధాలుగా ప్రోత్సహిస్తున్నాయి: ఉత్పత్తిని పెంచేందుకు సాగునీరు అందించటం, మురుగునీటి వ్యవస్థను ఏర్పాటు చేయటం, రుణసదుపాయం కల్పించటం, పరిశోధన, విస్తరణ; ఆదాయాన్ని కాపాడేందుకు విదేశీ పోటీ నుంచి రక్షణ, అవసరమైనప్పుడు గ్యారంటీ మద్దతు ధర కల్పించటం; ఒడిదుడుకులను, వృధాను నివారించేందుకు బీమా, గిడ్డంగులు, నిల్వ సదుపాయం కల్పించటం, మార్కెట్‌కు అవకాశం కల్పించటం, విలువ ఆధారితంగా మార్చటం.

నిరంతరం పెరుగుతున్న జనాభాకు, ఆర్థిక వ్యవస్థ అవసరాలు తీర్చటానికి ఉత్పాదకత కూడా పెరుగుతుండటం కీలకం. హేతుబద్ధమైన, ఖచ్చితమైన ఆదాయాలు రైతు మనుగడకు, వ్యవసాయం పరిరక్షణకు అత్యంత ముఖ్యం. సహజంగానే, వ్యవసాయం చాలా రిస్కుతో కూడుకున్నది, ధరలు నిలకడగా వుండవు. కాబట్టి ఉత్పత్తుల ధరలు ఆ రిస్కును భర్తీ చేయాలి. రైతు కష్టానికి ప్రతిఫలం ఇవ్వాలి. మార్కెట్‌కు నేరుగా అవకాశం కల్పించటం ద్వారా, మార్కెట్ సమాచారాన్ని మరింత మెరుగ్గా, విస్తృతంగా, తాజాగా అందించటం, సరఫరాలో ఆటంకాలు లేకుండా సరకురవాణాకు సదుపాయాల్ని మెరుగుపరచటం, వృధాను అరికట్టి విలువను జోడించేందుకు వ్యవసాయ ప్రాసెసింగ్‌ను ఏర్పాటు చేయటం ద్వారా ధరలలో ఒడిదుడుకులను తగ్గించాలి.

భారతీయ వ్యవసాయం దారుణ పరిస్థితులను ఎదుర్కోవటానికి ప్రధాన కారణం ప్రభుత్వం చేయాల్సిన పనులు చేయకుండా, చేయకూడని పనుల్ని పెద్దఎత్తున

కొనసాగించటం. ఈవేల్టికీ పంటలు పండించే భూమిలో మూడింట రెండోవంతు చెదురుమదురు వర్షాలు పడే మెట్ట ప్రాంతం. ఇక్కడ సాగునీటికి ఎలాంటి హామీ వుండదు. నీటి సంరక్షణ, భూసార పరిరక్షణలలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. రైతుల్ని ప్రకృతి దయాదాక్షిణ్యాలకు విడిచిపెట్టాయి.

హరిత విప్లవ కాలంలో వ్యవసాయ పరిశోధన, విస్తరణ ఎంపికచేసిన ప్రాంతాలలో చాలా పెద్దస్థాయిలో ఉండేవి. ఫలితంగా, మన ఆహారధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. సొంత అవసరాలను మించి ఆహారధాన్యాల రాశులు పోగయ్యాయి. స్వీయసమృద్ధితోపాటు మిగులు ధాన్యాలను కూడా భారత్ సాధించుకోగలుగుతుంది. 1950వ దశకంలో దేశంలో మొత్తం ఆహారోత్పత్తి 5 కోట్ల టన్నులు కాగా, ఈరోజు బాగా దిగుబడి తరుణంలో సర్కారీ గిడ్డంగులలో నిల్వ ఉంచిన ధాన్యమే 8.3 కోట్ల టన్నులు. కానీ హరిత విప్లవాన్ని పప్పుధాన్యాలు, నూనెవిత్తనాలకు, మెట్ట భూమి వ్యవసాయానికి విస్తరించలేదు. ఓ పక్క పప్పుధాన్యాల కొరతనెదుర్కొంటూ, మరోపక్క మనం 1కోటి టన్నుల వంటనూనెను దిగుమతి చేసుకుంటున్నాం.

కానీ వాస్తవానికి ప్రభుత్వాల ఘోరమైన తప్పిదాలు ఉత్పత్తి రంగంలోకంటే ధరల రంగంలో ఉన్నాయి. మార్కెట్లలో వైపరీత్యాలు సృష్టించటం, ఉద్దేశపూర్వకంగా ధరల్ని దెబ్బతీయటం, అవినీతిమయమైన లైసెన్స్–పర్మిట్–కోటా వ్యవస్థతో రైతుల్ని అణగదొక్కటంలో పాలకుల అసలైన తప్పిదాలు ఉన్నాయి. ఒకదశలో, 1973లో ఆహారధాన్యాల టోకు వాణిజ్యాన్ని కూడా కొద్దికాలం జాతీయీకరించారు. ఆ ప్రయోగం ఘోరంగా విఫలమైంది. కానీ రిటైల్ వ్యాపారాన్ని మాత్రం ప్రభుత్వాలు అత్యుత్సాహంతో నియంత్రిస్తూ వస్తున్నాయి. నిల్వ, రవాణా,అమ్మకాలు ఇంకా రాజకీయ నేతల, అధికార యంత్రాంగం దయాదాక్షిణ్యాల మీదే ఆధారపడివున్నాయి. చాలా భారీస్థాయిలో అసమర్థమైన, అవినీతిమయమైన ప్రజాపంపిణీ వ్యవస్థ (పి.డి.ఎస్)ను తయారుచేసిపెట్టారు. ధరల్ని అణగదొక్కటంతో పి.డి.ఎస్లోని ఆహారధాన్యాలలో సుమారు 40శాతం 'రీ సైకిల్' అయి తిరిగి ఎఫ్.సి.ఐకి చేరుతున్నాయి. ఎఫ్.సి.ఐ వద్దనున్న ఆహారధాన్యాలలో మూడోవంతు కంటే ఎక్కువ ఎటువంటి పైకప్పు లేకుండా ఆరుబైట ఉండటమో లేక అధ్వాన్నపు పరిస్థితులలో నిల్వఉండటమో జరుగుతుండటం వల్ల విపరీతమైన వృథా, అవినీతి జరుగుతున్నాయి. ఆహారధాన్యాల సేకరణ, పంపిణీలో

పి.డి.ఎస్‌లో వ్యవస్థీకృతమైన అవినీతి జరుగుతోంది. ఈ శాఖలలో ఉద్యోగాలు జాక్‌పాట్‌లులాగా తయారై వాటికి భారీ మార్కెట్ ఏర్పడింది. బదిలీలకి కోట్లు చేతులు మారుతున్నాయి. అయినా కూడా ప్రభుత్వం ఆహార భద్రత చట్టం పేరుతో 72శాతం ప్రజలకు రాయితీ ఆహారధాన్యాలను సరఫరా చేసేందుకు సిద్ధమవుతోంది. దానివల్ల మార్కెట్ వైపరీత్యాలకు లోనవటం, అవినీతి పెచ్చరిల్లటం వంటి పరిణామాలు తలెత్తి అంతిమంగా పేదరికాన్ని కొనసాగిస్తాయి, రైతుల్ని దెబ్బతీస్తాయి.

ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వాలు ప్రకటిస్తున్న కనీస మద్దతు ధర అటు న్యాయబద్ధంగా లేదు, ఇటు గిట్టుబాటుగా కూడా లేదు. తక్కువ నాణ్యత గల నాసిరకం ధాన్యం ఉత్పత్తిని, అమ్మకాన్ని ప్రోత్సహిస్తుంది. దానివల్ల రైతుకు ఏమాత్రం లాభం కలగకుండా ఖజానాకు తీవ్ర నష్టం వాటిల్లుతూ ఆహారం చాలామేర వృధా అవుతుంది లేదా 'రీ సైకిల్' అవుతుంది. ఆహార సబ్సిడీలపై ప్రభుత్వాలు చాలా ఖర్చు చేస్తున్నట్టు కనబడుతుందిగానీ పేదలకు మాత్రం తక్కువ ప్రయోజనం దక్కుతోంది. పాలకుల విధానాల వల్ల మార్కెట్ వైపరీత్యాలకు లోనవుతుండటంతో ఎరువులకు రాయితీల్ని ఇస్తున్నారు. మళ్లీ ఓపక్క ఖజానా ఖాళీ అవుతూ, మరోపక్క ప్లాంట్ పోషకాల విధానంలో తీవ్ర అసమతుల్యత కొనసాగుతోంది. చెడిపోకుండా నిల్వ ఉండే పత్తి, మిరప, పసుపు వంటి ఉత్పత్తుల ధరలు కూడా, నిల్వ వసతులు అత్యంత అధ్వాన్నంగా ఉండటం వల్ల తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. శీతల గిడ్డంగులు, ప్రాసెసింగ్ లేకపోవటం వల్ల పండ్లు, కూరగాయలలో 30-35శాతం వృధా అవుతున్నాయి. ఉత్పత్తిదారునికి, వినియోగదారునికి మధ్య అనేక అంచెల పెద్ద మార్కెట్ గొలుసు ఉంది. పలు సందర్భాలలో వినియోగదారులు చెల్లించే ధరలో కేవలం 35శాతం మాత్రమే రైతులకు దక్కుతోంది. నిల్వఉండకుండా కుళ్లిపోయే ఉత్పత్తుల విషయంలో రైతులకు దక్కేవాటా కేవలం 12-20శాతం మాత్రమే.

ఏకపక్షమైన, అర్థరహితమైన వాణిజ్య నియంత్రణలు, నిలకడలేని, తాత్కాలికమైన ప్రభుత్వ విధానాలు రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. మన ఆహారధాన్యాల నిల్వలు కుళ్లిపోతూ ధరలు పడిపోతూ ఉత్పత్తి పెరుగుతుంటే, ఆహారధాన్యాల ఎగుమతిని మాత్రం ఏళ్ల తరబడి నిషేధించారు. రైతుసంఘాలు, లోక్‌సత్తా పోరాటాలు చేశాక, ఎంతో ఆలస్యంగా 2011 ఉత్తరార్థంలో బియ్యం ఎగుమతుల్ని అనుమతించారు.

అది కూడా కోటాలు, షరతులతో. ఎగుమతులకు అనుమతిచ్చిన సందర్భంలో కూడా, పోర్టుల వద్ద అవినీతి, విధానపరమైన అవరోధాలు, అసమర్థత మనం పండించిన ధాన్యం అంతర్జాతీయ మార్కెట్లకు చేరకుండా ఆటంకాలుగా మారాయి. అనిశ్చితి, తాత్కాలిక ధోరణుల వల్ల భారతదేశ బియ్యం థాయ్ బియ్యంతో పోలిస్తే తక్కువ ధరకు అమ్ముడవుతోంది. వారంవారం ఎగుమతి కోటాలపై ఏకపక్ష నిర్ణయాలు, నిర్ణయాలు వెనక్కితీసుకోవటం ప్రమాదాలు భారత ప్రభుత్వం నుంచి పొంచివుంటున్నాయి. ఈ అనిశ్చితి వల్ల ఎగుమతిదారులు రిస్కులు తీసుకోవటానికి, దీర్ఘకాలిక మార్కెట్ సంధానాల్ని పెంపొందించటానికి సిద్ధపడలేకపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలలో ఆహారధాన్యాలను రాష్ట్ర సరిహద్దులు దాటించి అమ్మటాన్ని కూడా చట్టవిరుద్ధంగా నిషేధించి, కృత్రిమంగా ధరల్ని అణగదొక్కి రైతులను తీవ్రంగా దెబ్బతీశారు.

వ్యవసాయరంగంలో తాత్కాలిక ఎగుమతి విధానాలు డిమాండ్, సరఫరా, ధరలతో ముడిపడిన ఆర్థిక సూత్రాలను పూర్తిగా విస్మరించాయి. పత్తి ఎగుమతికి సంబంధించిన విధానాల్ని చూస్తే చాలు ఈ దారుణ తప్పిదం కళ్లకు కడుతుంది. వ్యవసాయరంగంలోని ఆత్మహత్యలలో ఎక్కువశాతం తీవ్రంగా నష్టపోయిన పత్తిరైతులవే. అయినా ప్రభుత్వం ధరల్ని దెబ్బతీసే విధానాన్ని నిస్సిగ్గుగా కొనసాగిస్తుంది. భారత వస్త్రపరిశ్రమకు ముడిసరకు కావాలనే సాకుతో కోటాలు విధించి, ఉద్దేశపూర్వకంగా ఎగుమతుల్ని నిషేధిస్తుంది. ధర బాగుంటే –భారతీయులైనా, విదేశీయులైనా– ఎవరికైనా రైతులు సంతోషంగా అమ్ముతారు. భారత్‌లో కొరత ఉంటే, ఆమేరకు ధరలు పెరుగుతాయనే సంకేతాన్నివ్వాలి, ఉత్పత్తిని పెంచి ధరల్ని స్థిరీకరించాలి. దానికిబదులు, ఎగుమతులపై నియంత్రణల్ని విధిస్తున్నారు. సంక్షోభంలో చిక్కుకున్న వ్యవసాయరంగం కేవలం కొన్ని పరిశ్రమలకు లాభాల్ని పెంచటం కోసం తక్కువ ధరలకు తెగనమ్ముకునే పరిస్థితులలోకి నెట్టబడుతోంది. పత్తికి తక్కువ ధర వస్తోందని రైతులు గనక ఇతర పంటలవైపు మళ్లితే, దీర్ఘకాలిక కొరత ఏర్పడి, ధరల పెరుగుదల ఆర్థికరంగంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.

వంటనూనెల్ని అత్యధికంగా దిగుమతి చేసుకునే దేశం భారత్. ప్రస్తుతం కొరతను అధిగమించటానికి మనం దిగుమతిచేసుకుంటున్నా, నూనెగింజల ఉత్పత్తిని పెద్దఎత్తున

చేపట్టాల్సిన అవసరముంది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే, వ్యవసాయోత్పత్తుల దిగుమతులపై సాధారణస్థాయి నుంచి భారీస్థాయి వరకూ సుంకాల్ని విధించటం, స్వదేశీ ఉత్పత్తిని పెంచటానికి రాయితీలివ్వటం ఆనవాయితీగా కనిపిస్తుంది. కానీ అదేంటో, వంటనూనెల దిగుమతిపై భారతదేశం ఎటువంటి సుంకాల్నీ విధించదు. అనేకసందర్భాలలో, దిగుమతుల మీద భారతదేశం ఆధారపడటాన్ని గమనించి, ఎగుమతి చేస్తున్న దేశాలు ఎగుమతి సుంకాన్ని విధిస్తున్నాయి. వంటనూనెల దిగుమతులపై తక్కువలో తక్కువగా 10శాతం దిగుమతి సుంకం విధించి, ఆ డబ్బును ఉత్పత్తి పెంచేందుకు నూనెగింజల రైతులకు రాయితీగా ఇస్తే, కేవలం కొన్ని సంవత్సరాలలో మనం కొరతల నుంచి బైటపడతాం. సాంకేతిక పరిజ్ఞానం, ధర రాయితీలు అందుబాటులో వుంటే ఘనఫలితాలను సాధించగలమని భారతదేశంలోని పేద, నిరక్షరాస్య చిన్న రైతులు పలుమార్లు రుజువు చేశారు.

సరైన ధరలను అందించేందుకు తగిన చర్యలను చేపట్టకుండా వున్న ప్రభుత్వ విధానాల ఘోరవైఫల్యాన్ని కళ్లకు కట్టటానికి ఆహారధాన్యాలు, పత్తి, వంటనూనెలు– ఈ మూడింటిపై తాత్కాలిక, హ్రస్వదృష్టిగల బూజుపట్టిన విధానాల ప్రభావం గురించి నేను స్థూలంగా వివరించాను. ఈ వైఫల్యం ఆర్థికవ్యవస్థలో దీర్ఘకాలిక ప్రమాదాలకు దారితీస్తోంది. ఇటీవల గోదావరి డెల్టాలో రైతులు పంట విరామం ప్రకటించటం నానాటికీ తీవ్రతరమవుతున్న సంక్షోభానికి అద్దంపడుతోంది. విశ్వసనీయ మార్కెట్ సమాచారం లేకుంటే రైతులు మెరుగైన ఆదాయాల కోసం గాలివాటంగా ఒక పంట నుంచి ఇంకో పంటకి వెంటవెంటనే మారుతుంటారు. దీనివల్ల ధరలలో తరచూ హెచ్చుతగ్గులు తలెత్తుతుంటాయి. న్యాయమైన ధరలకు భరోసా లేకపోవటం వల్ల దీర్ఘకాలిక కొరతలు, వ్యవసాయరంగంలో సంక్షోభం ఇవి రెండూ ఆర్థికవ్యవస్థకు అసలైన, అంతకంతకూ తీవ్రతరమవుతున్న సవాళ్లు. ప్రభుత్వం, రాజకీయపార్టీలు త్వరితంగా, విజ్ఞతతో కదలకపోతే ఈ సంక్షోభం గ్రామీణ భారతంలో పెను సంక్షోభానికి దారితీస్తుంది.

ప్రపంచంలోని వ్యవసాయభూమిలో 11శాతం భారతదేశంలోనే ఉంది. పుష్కలమైన సూర్యరశ్మి ఉంది. మంచి వర్షపాతం, పటిష్టమైన వ్యవసాయ సంస్కృతి మన సొత్తు. మన బలాల్ని వెలికితీసి సద్వినియోగం చేసి వ్యవసాయాన్ని ఆర్థికవ్యవస్థకు భారంగా

కాకుండా, ఎగుమతుల ద్వారా ఆదాయాన్ని ఆర్జించే రంగంగా, అభివృద్ధికి చోదకశక్తిగా చేసేలా ఒక సమగ్ర విధానాన్ని ఆవిష్కరించాల్సి ఉంది. రైతుల ప్రయోజనాలు, పారిశ్రామికాభివృద్ధి, దేశ సుసంపన్నత ఈ మూడూ పరస్పరం విడదీయలేనివని ఈ వ్యూహాత్మక మార్పు గుర్తించాలి. వ్యవసాయానికి, ఆహారానికి, వాణిజ్యానికి, పర్యావరణానికి వేర్వేరు మంత్రులను ఏర్పాటుచేసే సంకుచిత, విభజన ఆలోచనాధోరణి నుంచి మనం బైటపడాలి. రైతు, వినియోగదారుడి అభివృద్ధి రెండూ విడదీయలేనివి, అది పరస్పరాధారిత లక్ష్యం.

ఈ నేపథ్యంలో రైతులకు న్యాయమైన, లాభసాటి ధరలకు గ్యారంటీ ఇచ్చి గ్రామీణ పునరుజ్జీవనం, దేశ సమగ్ర ఆర్థిక ప్రగతి సాధించటానికి చేయవలసిందేమిటి? మనం అనేక విభాగాలలో– వాణిజ్య విధానాలు, గిడ్డంగులు, మార్కెట్ అవకాశం, విలువ ఆధారితంగా మార్చటం, నూతన సాంకేతిక పరిజ్ఞానం, మద్దతుగా ధర, వ్యవసాయ మద్దతును పునర్వ్యవస్థీకరించటంలో చర్యలు చేపట్టాల్సి ఉంది.

వాణిజ్య విధానాలు, సరకుల ధరల్ని నిర్ణయించటం నుంచి మొదలుపెడదాం. స్వల్పకాలికంగా గానీ, దీర్ఘకాలికంగా గానీ స్వేచ్ఛావాణిజ్యం ద్వారానే సరకుల సరఫరా అవరోధాలు లేకుండా ఖచ్చితస్థాయిలో జరుగుతుందని మనకు గత శతాబ్దపు ప్రపంచ చరిత్ర చెప్పిన పాఠం. స్వల్పకాలికంగా చూస్తే, డిమాండ్, ధరలు ఎక్కడ ఎక్కువగా ఉంటే అక్కడికి సరఫరా ఉంటుంది. దీర్ఘకాలికంగా, మంచి ధరల ద్వారా, అప్పటిదాకా సరఫరా తక్కువగా ఉన్న సరకు ఉత్పత్తిని పెంచేందుకు ప్రోత్సాహాన్నిస్తుంది. వ్యవసాయంలో సోవియెట్ యూనియన్ వైఫల్యం, స్వేచ్ఛావాణిజ్యం అమలు తర్వాత చైనా వ్యవసాయం సాధించిన విజయం–ఆర్థిక స్వేచ్ఛకున్న ప్రయోజనాల్ని రుజువు చేసే బలమైన సాక్ష్యాలు. అరుదుగా వచ్చే ఆహారకొరతని తట్టుకోవటానికి ప్రభుత్వం వ్యూహాత్మక నిల్వలను ఏర్పాటుచేయాల్సిందే. గిడ్డంగులకు, మార్కెటింగ్ మౌలికసదుపాయాలకు సర్కారు ఊతమివ్వాల్సిందే. రెండో ప్రపంచయుద్ధ సమయంలోలాగా భయంకరమైన కరవు పరిస్థితులు నెలకొన్నప్పుడు చాలా సమర్థవంతమైన ప్రజాపంపిణీ వ్యవస్థ ఉండాలి. రోడ్డు సౌకర్యం, నిల్వ, రిటైల్ మౌలికవసతులకఏర్పాట్లు పటిష్టంగా ఉండాలి. కానీ రేషనింగ్, ధరల నియంత్రణ దీర్ఘకాలంలో ఎప్పుడూ సత్ఫలితాలనివ్వవు. అవినీతికి, రాయితీ సరకుల్ని ఎక్కువ ధరలున్న మార్కెట్లలో అమ్ముకునే దళారీ వ్యవస్థకు దారితీస్తాయి.

రేషన్ విధానం పక్కాగా అమలైంది కఠినాతికఠినంగా శిక్షలు వేసే యుద్ధసమయంలోనే. స్టాలిన్‌గ్రాడ్ ముట్టడి సందర్భంగా రష్యన్ జనరల్ మార్షల్ ఝుకోవ్ క్రూరమైన అణచివేత పద్ధతులలో రేషనింగ్‌ని అమలుచేశారు. తిండి కోసం అలమటిస్తున్న ఓ కుటుంబం ఆకలి చావును తప్పించుకునేందుకు అదనపు రేషన్ల కోసం ఆశపడి తమ కుటుంబ పెద్ద మరణించారనే సమాచారాన్ని గోప్యంగా ఉంచటంతో ఆ కుటుంబంలోని వారందర్నీ ఝుకోవ్ కాల్చిచంపారు. భయంకరమైన కొరత, జాతీయ సంక్షోభం వంటి సందర్భాలలో అటువంటి కఠినాతికఠినమైన చర్యలు అవసరమవుతాయి. కానీ సాధారణ సమయాలలో అవి అంగీకారయోగ్యంకావు. పైపెచ్చు వ్యతిరేక ఫలితాలనిస్తాయి. ముఖ్యంగా ఆహార ఉత్పత్తి మన అవసరాలని మించి జరుగుతున్నప్పుడు నియంత్రణ, కఠినచట్టాలు, క్రూరచర్యలు అవినీతిని పెంచుతాయి, వ్యవసాయాన్ని కుంగదీస్తాయి.

తగినంత సరఫరా ఉన్న సమయాలలో, న్యాయమైన వాణిజ్యం జరిగేటట్టు, మార్కెటింగ్‌కు మౌలికసదుపాయాలు ఉండేటట్టు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని సమానవకాశాలతో కూడిన పోటీ నెలకొనేటట్టు చూడాలి. ప్రభుత్వ సాయం అవసరమున్న పేదలు బహిరంగ మార్కెట్‌లో ఆహారాన్ని కొనుగోలు చేసుకోవటానికి వీలుగా వారికి నగదు సహాయం లేదా ఆహార స్టాంపులను అందించటం వల్ల ఎక్కువగా లబ్ధి పొందగలుగుతారు. దానికి బదులు మనం నియంత్రణల మీద, నిత్యావసర వస్తువుల చట్టం ద్వారా అవినీతిమయంగా మారిన పౌరసరఫరాల యంత్రాంగం మీద విపరీతంగా ఆధారపడుతున్నాం. ఫలితాల్ని చూస్తూనే ఉన్నాం. వ్యవస్థీకృత అవినీతి, సర్కారీ ఏకపక్ష నిర్ణయాలు, ప్రజాధనం వృధా, రీసైక్లింగ్, రాయితీ సరకులను మార్కెట్లకు తరలించటం ద్వారా టోకు అవినీతి, అవినీతిని పెంచి పోషించే బదిలీల వ్యాపారం, మార్కెట్ ధరల్ని అణగదొక్కటం, ఆశ్రితపక్షపాత ధోరణి, వ్యాపారంలో, వాణిజ్యంలో ప్రభుత్వ ఆస్థాన విద్వాంసుల సంస్కృతి – ఇవన్నీ ఆ దుష్ప్రభావాలే.

తాత్కాలిక ధోరణులతో, ఇష్టమొచ్చినట్టు వ్యవహరించే ప్రభుత్వ విధానం వల్ల మార్కెట్ ఎలా వైపరీత్యాలకు లోనవుతుందో ఇప్పటికే వివరించాను. మనకు సామర్థ్యం ఉన్న చోట మన వ్యాపారులు అభివృద్ధి చెందే అవకాశాన్ని కల్పించి ప్రపంచ మార్కెట్లలో

ప్రభావం చూపే స్థాయికి ఎదిగే అవకాశాలు కల్పిస్తే అప్పుడు మనదేశం ఎగుమతులలో ముందుకు దూసుకుపోగలుగుతుంది. అలాకాకుండా దేశంలోలోపలే లైసెన్స్–కంట్రోల్–పర్మిట్ రాజ్యాన్ని నిర్మించి, కరడుగట్టేలా తయారుచేయటం అటు రైతుల్ని, ఇటు వినియోగదారుల్నీ మరింత దెబ్బతీస్తుంది. వంటనూనెలు, పంచదార, పప్పుదినుసులు– అన్నీ కంట్రోల్ రాజ్యం వల్ల దెబ్బతింటున్నాయి. ఉత్పత్తిని పెంచేలా ప్రోత్సాహక ధరల్ని అందించటానికి బదులు, మనం కొరతలు, అవినీతిని పెంచిపోషించే ఆర్థికవ్యవస్థను నిర్మిస్తున్నాం.

ధాన్యం, బియ్యంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చట్టవిరుద్ధంగా విధించిన ఆంక్షల్ని ఈ సందర్భంగా ఓ ఉదాహరణగా చెప్పుకోవాలి. రాష్ట్రాల మధ్య వాణిజ్యానికి అన్ని ఆటంకాల్నీ కేంద్రప్రభుత్వం తొలగించింది. ఒక కేంద్రచట్టంపై కేంద్రం ఆదేశాలకి, సూచనలకి వ్యతిరేకంగా వ్యవహరించే అధికారం రాష్ట్రాలకు లేదు. అయినా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సన్నరకం ధాన్యం బియ్యం రాష్ట్రసరిహద్దులు దాటకుండా ఆంక్షల్ని కొనసాగిస్తోంది. ఫిబ్రవరి, 2012లో బి.పి.టి ధాన్యం 75 కిలోల బస్తా కర్ణాటక, మహారాష్ట్రలో రూ.1200 ఉంటే, సరిహద్దుకు ఇవతల ఆంధ్రప్రదేశ్‌లో రూ.750 మాత్రమే ఉంది. చట్టవిరుద్ధ ఆంక్షల పుణ్యమాని. సరిహద్దుల వద్ద జరిగే వాణిజ్య కలాపాలలో అవినీతి మేటవేసింది. అప్పుడు లోక్‌సత్తా, స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య 'రైతు సత్యాగ్రహం' చేపట్టాయి. కర్నూలు నుంచి కర్ణాటకకు, నిజామాబాద్ నుంచి నాందేడ్‌కు మేం 'పాదయాత్ర' చేపట్టాం. వందలాది వలంటీర్లు భుజాల మీద ధాన్యం, బియ్యం మూటల్ని మోస్తూ ప్రభుత్వ నిషేధాన్ని ధిక్కరిస్తూ సరిహద్దు దాటి పక్క రాష్ట్రాలలో సరకుల్ని అమ్మారు. చేతనైతే అరెస్టు చేసి ప్రాసిక్యూట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని సవాలు చేశారు. నిషేధం చట్టవిరుద్ధం, అనైతికం అని గుర్తించిన రాష్ట్రప్రభుత్వం మమ్మల్ని అరెస్టు చేసే సాహసం చేయలేదు. ధాన్యం, బియ్యం రవాణాను అడ్డుకునే హక్కు ప్రభుత్వానికి లేదని కొన్ని రోజుల వ్యవధిలోనే రైతులకు, వ్యాపారస్తులకు అర్థమైంది. ఆ వెంటనే ఆంధ్రప్రదేశ్‌లో ధాన్యం 75 కిలోల బస్తా ధర రూ.1200కి పెరిగింది. కేవలం కొన్నివారాలలోనే రూ.450, అంటే 60శాతం బస్తాకి రేటు ఎగబాకింది. సుమారు 40 లక్షల టన్నుల బి.పి.టి బియ్యం (లేదా సమానమైన ధాన్యం) ఆ సమయంలో అమ్మకానికి సిద్ధంగా ఉంది. స్వేచ్ఛావాణిజ్యాన్ని సాధించటం

ద్వారా ఈ రైతు సత్యాగ్రహం రైతుల ఆదాయాన్ని కేవలం ఒక్క సీజన్‌లో, ఒక్క వెరైటీ (బి.పి.టి) పంటకు, కేవలం ఒక్క రాష్ట్రంలో రూ.3600కోట్లు మేర పెంచగలిగింది.

అవినీతి దాకా వెళ్లకుండానే, కేవలం ప్రభుత్వాల నియంత్రణల వల్ల ఏటా రైతులు ఎంత భారీస్థాయిలో నష్టపోతున్నారో ఈ రైతుసత్యాగ్రహం క్రమాన్ని చూస్తే అర్థమవుతుంది. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించటానికి వాణిజ్యాన్ని కట్టడి చేయాలనే వాదన, అరువు తెచ్చుకున్న భావజాలంతో చాలా అవమానకరమైన రైతువ్యతిరేక విధానాన్ని సమర్థించే ధోరణి. రైతుకు, వినియోగదారునికి మధ్య ఉన్న దళారీ గొలుసుని తొలగించి లావాదేవీల్ని నేరుగా జరిపే ఏర్పాటు చేయగలిగితే, వినియోగదారునిపై భారం తగ్గి న్యాయబద్ధమైన ధరలో సరకులు అందుబాటులో ఉంటాయితప్ప, ఇప్పటికే తీవ్రంగా నష్టపోయి పేదరికంలోకమగ్గుతున్న రైతుల మీద నియంత్రణల్ని విధించి ఇంకా దెబ్బతీయటం ద్వారా కాదు. వాస్తవానికి ధరల్ని అణగదొక్కటం వల్ల దీర్ఘకాలంలో కొరత ఇంకా ఎక్కువై ధరలు మరింత పెరుగుతాయి. రైతులు విధిలేక ఇతర వృత్తులకో, లేక కాస్త ఎక్కువ ఆదాయం వచ్చే నియంత్రణలేని పంటలవైపుకో మళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

దేశంలోపల, దేశ సరిహద్దులకు ఆవల ఆహారధాన్యాల వాణిజ్యంపై ఉన్న పరిమితుల్ని, నియంత్రణల్ని మనం నిర్ద్వంద్వంగా ఎత్తివేయాలి. ప్రభుత్వ గోదాములలో ఆహారధాన్యాల రాశులు ముక్కిపోతూ కుళ్లిపోతుంటే, నిల్వకు, నిర్వహణకు భారీగా ప్రజాధనాన్ని వినియోగిస్తుంటే, అంతర్జాతీయ వాణిజాన్ని నిలుపుచేయటం లేదా నియంత్రణ విధించటం నేరసమాన తప్పిదమవుతుంది. ఆపదలో ఆదుకోవటానికి అవసరమైన మేర వ్యూహాత్మక నిల్వ చేసుకుంటే చాలు, పంటని ఉత్పత్తి చేసే రైతుల ప్రయోజనాలని కాపాడితే, అది ధరల స్థిరత్వానికి దారితీసి వినియోగదారుల ప్రయోజనాలని కాపాడుతుంది. ఈవిధంగా విధానాలని మారిస్తే ధాన్యం సేకరణ, నిల్వబాగా తగ్గుతాయి. ధాన్యం సేకరణ, నిల్వ, అసమర్థ ప్రజాపంపిణీ, అవినీతి, లీకేజీలు, రాయితీ సరకులతో అక్రమాలు తదితరాలపై ఇప్పుడు ఖర్చయ్యే వేలకోట్లు ఆదా అవుతాయి. అటు ఉత్పత్తిదారులకు, ఇటు వినియోగదారులకు లాభం చేకూరుతుంది. ఇలా వృధా ఖర్చుని తగ్గించి వనరులని విజ్ఞతతో, ముందుచూపుతో వినియోగిస్తే రైతులు, పేదలు లబ్ధిపొందుతారు.

పత్తి వంటి ఆహారేతర ఉత్పత్తులకు సంబంధించి, ఇదే విధమైన దీర్ఘకాలిక, సరైన అంచనాలతో కూడిన విధానాన్ని చేపట్టటం వల్ల మంచి ఫలితాలు వస్తాయి. అన్ని రకాల వాణిజ్య ఆంక్షల్ని తొలగించాలి. భారత్‌లోని ధరల్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ధరలతో పోల్చిచూడాలి. ఒక్కసారి ధరల స్థిరత్వం వచ్చాక మన రైతులు దీర్ఘకాలిక ప్రణాళికలతో వ్యవహరించగలుగుతారు, మన సామర్థ్యాల్ని ప్రదర్శించగలుగుతారు. విలువైన విదేశీ మారకద్రవ్యాన్ని మనదేశం ఆర్జించగలుగుతుంది. మన వ్యవసాయం లాభసాటిగా మారి, ప్రభుత్వం కూడా కొంతమేర ఎరువుల సబ్సిడీ భారాన్ని తగ్గించుకోగలుగుతుంది. మొక్కల పోషకాలను హేతుబద్ధంగా వినియోగించే దిశగా చర్యలపై దృష్టి సారించగలుగుతుంది.

పామాయిల్, చాలా సందర్భాలలో పప్పుదినుసుల దిగుమతుల విషయంలో మనం స్వల్పకాలిక కొరతల్ని అధిగమించి, మధ్యకాలిక ఉత్పత్తిని పెంచే రెండు లక్ష్యాలతో ఒక హేతుబద్ధ విధానాన్ని అనుసరించాల్సుంది. అంతర్జాతీయ దిగుమతుల నుంచి మన రైతుల్ని రక్షించేందుకు మనకు ప్రపంచ వాణిజ్య ఒప్పందాలలో మనకు అన్నిరకాల వెసులుబాట్లు ఉన్నాయి. ఎక్కువ సుంకాల్ని కూడా విధించుకునే అవకాశం మనకుంది. ప్రస్తుతం వంటనూనె దిగుమతికి రూ. 40,000కోట్లు ఖర్చుచేస్తున్నాం. 10-20శాతం దిగుమతి సుంకం విధించి, ఆ డబ్బుల్ని ఉత్పత్తి పెంచే దిశగా రైతులకు రాయితీలుగా ఇవ్వటం తెలివైన చర్య అవుతుంది. ఈ విధానం వల్ల అందుబాటు ధరలకు, ఉత్పత్తిలో పెరుగుదలకు, అవసరాలకు తగ్గ ఉత్పత్తి అందుబాటులో ఉండేందుకు భరోసా ఏర్పడుతుంది. ఇటువంటి వ్యూహాత్మకమైన విధానం వ్యవసాయరంగానికి ఓ బలమైన సంకేతాన్నిస్తుంది, విదేశీ మారకద్రవ్యాన్ని కూడా ఆదా చేస్తుంది.

అలాగే ప్రభుత్వ నియంత్రణలకి గురికాని, నిల్వ ఉండే పంటలు కూడా ధరలలో తీవ్రస్థాయి ఒడిదుడుకులకు లోనవుతూ అటు ఉత్పత్తిదారులను, ఇటు వినియోగదారులను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. పత్తి, మిరప, పసుపు మూడు ఉదాహరణలు. ఎఫ్.సి.ఐ ధాన్యం/బియ్యం సేకరణ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ. 1500 కోట్ల మేర పన్ను ఆదాయాల్ని ఏటా పొందుతున్నా, మరో రూ. 400-500 కోట్లు మార్కెట్ సెస్సు రూపంలో వసూలుచేస్తున్నా ప్రభుత్వం నిర్వహిస్తున్న మార్కెట్లు అత్యంత అధ్వాన్నపు స్థితిలో వున్నాయి. నిల్వ చేసేందుకు కావలసిన

మౌలికవసతుల కల్పనకు పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి, పంట ఉత్పత్తులను నిల్వచేసుకున్న రైతులకు గ్యారంటీ ప్లెడ్జి రుణాలు అందించేందుకు ఏర్పాట్లు చేయటం వల్ల రైతులకు ఎంతో ఊరట లభిస్తుంది. పత్తి, మిరప, పసుపులాంటి పంటల ధరలు ఓ వలయంలో చిక్కుకున్నట్లు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. అదేగనక రైతుకు తన పంటను నిల్వ చేసుకునే సదుపాయం ఉండి, తన ఖర్చుకు, ఉత్పత్తి అవసరాలకు డబ్బు తెచ్చుకునే అవకాశం ఉంటే అయినకాడికి తెగనమ్ముకోవాల్సిన అవసరం లేదు. తనకు నచ్చిన ధరకు అమ్ముకునే స్వేచ్ఛ రైతుకి లభిస్తుంది, ధరలు ఉన్నకొద్దీ మెరుగుపడుతుంటాయి. అదేరీతిలో, వినియోగదారులు కూడా సరకుల కొరత ఉన్నప్పుడు ఎక్కువ ధరలు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ధరలు పెరిగితే, ఉత్పత్తిదారులు తమ సరకుల్ని అమ్మకానికి మార్కెట్‌లోకి తీసుకొస్తారు. డిమాండ్, సరఫరా స్వేచ్ఛామార్కెట్‌లో కొనసాగే ఏర్పాటు వల్ల ధరలు నిలకడగా ఉంటాయి. ఒక్కసారి దీర్ఘకాలిక ధరలు స్థిరపడితే, వ్యవసాయంలోకి పెట్టుబడులు ప్రవహిస్తాయి. ఉత్పత్తి, ఉత్పాదకత రెండూ గణనీయంగా పెరుగుతాయి. ఉత్పాదకత పెరుగుతున్నకొద్దీ ధరలు నియంత్రణలో ఉంటాయి. మొత్తం ఆర్థికవ్యవస్థ దీర్ఘకాలంలో లాభపడుతుంది. నిల్వఉండే పంటల విషయంలో కూడా దిగుబడి తర్వాత తగిన విధానంతో వ్యవహరించటంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి. ఈ వైఫల్యం వల్ల వ్యవసాయరంగంలో అసాధారణ కష్టనష్టాలు ఏర్పడి, సంక్షోభం తీవ్రతరమైంది. నేను ఇంతకుముందే చెప్పినట్టు భారతదేశంలోని వ్యవసాయ ఆత్మహత్యలలో ఎక్కువశాతం ఈ నిల్వఉండే పంటల రైతులవే.

రైతుల నుంచి పెద్దఎత్తున పన్నుల్ని, సెస్సుల్ని వసూలు చేస్తున్నా కూడా మార్కెటింగ్ సదుపాయాలు కల్పించలేని ప్రభుత్వ వైఫల్యం అక్కడ కేవలం గిడ్డంగుల సదుపాయాల కొరతకే పరిమితంకాలేదు. మార్కెట్ కమిటీలు పూర్తిగా ప్రభుత్వ చేతులలో ఉన్నాయి. వారి నిర్వాహకుల్ని స్థానిక శాసనసభ్యులు ఇష్టాయిష్టాల మేరకు పార్టీల రాజకీయావసరాలకనుగుణంగా నియమించుకుంటున్నారు. పన్నులను, మార్కెట్ సెస్సును చెల్లించే, పంటలను ఉత్పత్తి చేసి వాటిని మార్కెట్ చేసుకోవాల్సిన రైతులకు మాత్రం మార్కెట్ కమిటీల నిర్వహణలో అధికారం లేదు. వారి మాటకు విలువ లేదు. చాలా మార్కెట్ కమిటీలు దయనీయ స్థితిలో అవసాన దశలో వున్నాయి.

రైతులకు మార్కెట్ అవకాశం కల్పించటం లేదు. అనైతిక ప్రైవేటు వ్యాపారుల నుంచి వారికి రక్షణ కల్పించటం లేదు. తెలంగాణ ప్రాంతంలోలా మార్కెట్లు ఎంతోకొంత పనిచేస్తున్న కొన్నిచోట్ల కూడా పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయి. రైతులకు తలదాచుకునే చోటు లేదు. మార్కెట్‌కి తెచ్చే ధాన్యం లేదా పత్తికి వర్షం నుంచి రక్షణ ఏర్పాట్లు లేవు, ప్రహరీ గోడలు లేవు (ఫలితంగా పందికొక్కులు, వీధికుక్కల బెడద ఎక్కువైంది), మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం లేవు, ఎలక్ట్రానిక్ తూనికలు లేవు, సేకరణ ప్రమాణాలకనుగుణంగా ఆహారధాన్యాలలో తేమశాతాన్ని తగ్గించేందుకు డ్రైయర్లు లేవు. నిజాయతీగా, సగర్వంగా ఉత్పత్తిచేసి తెచ్చేవారిని బిచ్చగాళ్లలా చూస్తున్నారు. వారి ఆత్మగౌరవాన్ని, ఆదాయాన్ని కొల్లగొడుతున్నారు.

ఉత్పత్తిదారునికి, వినియోగదారునికి మధ్య పలు అంచెల గొలుసుకట్టు దళారీ వ్యవస్థ ఉంది. ఫలితంగా, వినియోగదారుడు చెల్లించే డబ్బులో చాలా కొద్ది వాటా మాత్రమే రైతుకు దక్కుతోంది. మరోపక్క వినియోగదారుడు ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేయటం మినహా గత్యంతరం లేకపోతోంది. రైతుకు తక్కువ ఆదాయం, ఎక్కువ ఆహారద్రవ్యోల్బణం– రెండూ కలగలిసి కొనసాగుతున్న విచిత్ర పరిస్థితి ఇది. రైతుబజార్లను సమర్థవంతంగా అమలుచేస్తున్న చోట చిన్నరైతులకు నేరుగా మార్కెట్ అవకాశం లభిస్తోంది. మార్కెట్‌లో కొనుగోలుదారులు చెల్లించేందుకు సిద్ధపడిన ధర వారికి అందుతోంది. మౌలికవసతుల లోపాలు, వ్యాపారస్తులుకాకుండా రైతులు మాత్రమే వినియోగించుకునేలా పటిష్ట చర్యలు తీసుకోవటంలో అధికారయంత్రాంగం విఫలమవటం వల్ల రైతుబజార్ల పైలెట్ ప్రాజెక్టులు పూర్తిగా విజయవంతం కాలేకపోయాయి. అయినా ఈ అరకొర, అసంతృప్తస్థాయి పరిస్థితులలో కూడా అవి విజయం సాధించటం చూస్తే, నేరుగా మార్కెట్ అవకాశం, మార్కెట్ అంచెల గొలుసుని కుదించటం వల్ల రైతులకు మెరుగైన ధర లభిస్తుందని, వినియోగదారులకు అందుబాటు ధరలలో నాణ్యమైన ఉత్పత్తులు లభిస్తాయని రుజువైంది.

కాబట్టి మార్కెట్లని పూర్తిగా ప్రజాస్వామీకరించి రైతుల ప్రత్యక్ష నియంత్రణలోకి తీసుకురావాల్సి ఉంది. రైతుల ప్రయోజనాలను పరిరక్షించటానికి వారు కోరితే గనక నిర్వహణకు, వృత్తిపరమైన నైపుణ్యాలకు తగిన సాయం అందించాలి. కానీ బైటి నుంచి మార్కెట్లపై పెత్తనం ఉండటానికి వీల్లేదు. ప్రజాస్వామిక నియంత్రణలోనే,

భాగస్వాములైన రైతుల నిర్వహణలోనే అవి ఉండాలి. వ్యవసాయోత్పత్తులకు సంబంధించిన అన్ని రకాల పన్నుల్ని, సెస్సుల్ని మార్కెట్లలో మౌలికవసతుల్ని మెరుగుపరిచేందుకు నేరుగా జమ చేయాలి. మార్కెట్ అవకాశాన్ని మెరుగుపరిచేందుకు, మంచి ధర లభించేందుకు వీలుగా గిడ్డంగులు, ఇతర సదుపాయాల కల్పనకు ఆ వనరుల్ని నేరుగా ఎన్నికైన కమిటీలకు బదిలీ చేయాలి. జవాబుదారీతనం, పారదర్శకత కోసం ఈ నిర్వహణ సమదృష్టితో, దృఢత్వంతో వ్యవహరించే పర్యవేక్షణ కింద జరిగే ఏర్పాటు చేయాలి.

ఇక కుళ్ళిపోయే పంటలు. ప్రకృతిలో వచ్చే అనూహ్యామార్పుల వల్ల, డిమాండ్–సరఫరాల మధ్య అసమతుల్యతల వల్ల కుళ్లిపోయే ఉత్పత్తుల ధరలలో హెచ్చుతగ్గుల్ని నియంత్రించటం వ్యవసాయ మార్కెటింగ్‌లోని అతిపెద్ద సవాళ్లలో ఒకటి. అధ్వాన్నంగా వున్న నిల్వసదుపాయాలు, మార్కెట్‌లో అమ్ముడయ్యేవాటి కంటే ఎక్కువ సరఫరా వల్ల మన పండ్లు, కూరగాయలలో 35శాతం వృధా అవుతున్నాయి. అరకొర మార్కెట్ అవకాశం, స్టోరేజీ సదుపాయం లేకపోవటం అంటే, మదనపల్లిలో టమాటా కిలో అర్ధరూపాయి (50పైసలు) ఉంటే, హైదరాబాద్‌లో వినియోగదారులు కిలోకి రూ.15 చెల్లించి కొనుగోలు చేస్తుంటారన్నమాట. ధరలు విపరీతంగా ఎగిసిపడుతూ రైతుల్ని, వినియోగదారుల్ని దెబ్బతీస్తున్నాయి. ఈ సమస్యలను అధిగమించటానికి అభివృద్ధి చెందిన దేశాలలో, అభివృద్ధి చెందుతున్న చాలా ఆర్థికవ్యవస్థలలో మంచి రవాణావ్యవస్థను, శీతలనిల్వ సదుపాయాల్ని ఏర్పాటు చేశారు. వాటికితోడు, వృధాను అరికట్టటానికి, వ్యవసాయోత్పత్తులకు అదనపు విలువ చేకూర్చటానికి, పారిశ్రామికీకరణను ప్రోత్సహించటానికి, ఉపాధి అవకాశాల కల్పనకు, రైతుల వద్ద పొలం నుంచి నేరుగా సేకరించే ధరల్ని పెంచేందుకు చాలా పెద్దస్థాయిలో ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమను అందుబాటులోకి తెచ్చారు. ఎప్పుడైతే తగినంత నిల్వ, ప్రాసెసింగ్ ఉందో, రైతులు అయినకాడికి అమ్ముకోవాల్సిన పనిలేదు. ఆహారం వృధా అవదు. మార్కెట్‌లో డిమాండ్ తక్కువగా ఉండి సరఫరా ఎక్కువగా ఉండి ధరల్ని దెబ్బతీస్తుంటే, కనీసస్థాయి గ్యారంటీ ధరలకు ఈ ప్రాసెసింగ్ విభాగాలు కొనుగోలు చేస్తాయి. చట్టపరమైన ఏర్పాట్లతో దీన్ని మరింత ప్రోత్సహించి ఒప్పంద (కాంట్రాక్ట్) వ్యవసాయాన్ని పెంపొందించి రైతుల ప్రయోజనాలను పరిరక్షించవచ్చు. రైతుల ఆదాయానికి ఆరీతిలో

భరోసా కల్పించవచ్చు. వృధాగా పోయే పండ్లు, కూరగాయలను సద్వినియోగం చేయవచ్చు. పండ్లు, కూరగాయలు సరఫరా డిమాండ్‌కన్నా తగ్గి మార్కెట్‌లో ధరలు పెరిగిన సందర్భాలలో, ప్రాసెస్ చేసిన ఆహారోత్పత్తులు మార్కెట్‌లోకి ప్రవేశించి డిమాండ్ అవసరాన్ని భర్తీచేస్తాయి. దీనివల్ల కొరతలు తగ్గి ధరలు స్థిరంగా ఉంటాయి.

ఏటా 20 కోట్ల టన్నుల పండ్లు, కూరగాయల ఉత్పత్తితో భారతదేశం ప్రపంచంలో రెండోస్థానంలో ఉంది. మనకు 5000కుపైచిలుకు మాత్రమే శీతలనిల్వ సదుపాయాలు ఉన్నాయి. వీటి మొత్తం సామర్థ్యం 2.36 కోట్ల మెట్రిక్ టన్నులు. ఈ శీతలనిల్వ సదుపాయాలలో 80శాతం బంగాళదుంపల కోసమే వినియోగిస్తున్నారు. ఉద్యానవన పంటల్లో 35–40శాతం, ఆహారధాన్యాలలో 10శాతం నిల్వకు సదుపాయంలేక వృధాగా పోతున్నాయి. నిల్వఉండని ఉత్పత్తులకు దిగుబడి తర్వాత జరుగుతున్న నష్టాల మొత్తం ఏటా రూ. 1,00,000 కోట్లు పైమాటేనని అంచనా. నేరసమానమైన వృధాని అరికట్టి, రైతుల ఆదాయాల్ని మెరుగుపరిచేందుకు, వినియోగదారులకు అందుబాటు ధరల్ని స్థిరీకరించేందుకు, నాణ్యమైన ఆహారసరఫరాకు భరోసా ఇచ్చేందుకు రవాణా, శీతలనిల్వ, ప్రాసెసింగ్, రిటైల్ చైన్లలో భారీ పెట్టుబడులు అవసరం.

ఈ మౌలికసదుపాయాల్ని మెరుగుపరిచేందుకు అందుబాటులో వున్న ప్రతి వనరునూ ప్రభుత్వం వినియోగించాలి. కానీ అంత భారీకార్యక్రమాన్ని చేపట్టటానికి తగిన వనరులుగానీ, నిర్వహణా సామర్థ్యంగానీ ప్రభుత్వానికి లేవు. వాస్తవిక దృష్టితో ఆలోచిస్తే, ఇప్పుడున్న రెగ్యుటెడ్ మార్కెట్లను మెరుగుపరిచి, మౌలికసదుపాయల్ని కల్పించి, గిడ్డంగుల్ని అందుబాటులోకి తేగలవు. భారత్‌లో రిటైల్ వ్యాపారం ఏటా సుమారు 590 బిలియన్ డాలర్ల మేర ఉంటుందని, ప్రతి ఏడాదీ అది 13శాతం మేర పెరుగుతోందని అంచనా. గ్రేడింగ్, ఒప్పంద వ్యవసాయం, ప్యాకేజింగ్, పెట్టుబడి సహాయం, అవసరమైన ఇతర తోడ్పాటుల ద్వారా వ్యవసాయోత్పత్తుల నాణ్యత పెంచేందుకు వ్యవస్థీకృత రిటైల్ పరిశ్రమ అవసరం. సరఫరా వ్యవస్థను, సంబంధిత మౌలికవసతుల్ని మెరుగపరచటం ద్వారా వృధా లేకుండా పోతుంది. రైతులకు నేరుగా మార్కెట్ అవకాశం అందుబాటులోకి వస్తుంది. వ్యవసాయ ఆదాయాలను మెరుగుపరచటంతోపాటు నాణ్యతాప్రమాణాలు పెరగటం వల్ల మన రైతులు ప్రపంచమార్కెట్లలో కొత్త అవకాశాలను అందుకోగలుగుతారు. సువిశాలమైన

సాగుయోగ్య భూమి, మంచి సూర్యరశ్మి, ఉష్ణమండల వాతావరణం, తగినంత వర్షపాతం కలిగిన భారతదేశం  నాణ్యతను మెరుగపరిచేందుకు రైతులకు తోడ్పాటు కూడా ఇస్తే విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించే ప్రధాన దేశంగా మనదేశం ప్రపంచపటంలో వెలుగొందుతుంది.

మన వ్యవసాయానికి జవసత్వాల్ని అందించి, ధరల్ని స్థిరీకరించి, ఉద్యోగాల్ని సృష్టించి, ఎగుమతుల్ని ప్రోత్సహించటానికి వ్యవస్థీకృత రిటైల్ చైన్లలో భారీఎత్తు పెట్టుబడులు కావాలి. రైతుల ప్రయోజనాల్ని కాపాడటానికి తగిన చర్యలు తీసుకుంటున్నంత వరకూ పెట్టుబడులు ఎక్కడ్నుంచి వస్తున్నాయన్నది పెద్ద అంశం కాదు. ఉదాహరణకు, దేశంలోపలే సేకరణ చేయటాన్ని తప్పనిచేయటం, కొనుగోలులో గుత్తాధిపత్యాల్ని నివారించేందుకు నియంత్రణా వ్యవస్థల ఏర్పాటు అవసరం. ఎఫ్.డి.ఐ మీద ఇటీవలి చర్చ చాలావరకూ పక్కదోవ పట్టింది. డెంగ్ జియావో పింగ్ ప్రశస్తంగా చెప్పినట్టు, ఎలకల్ని పడుతున్నంత వరకూ పిల్లి నల్లదా, తెల్లదా అనే ప్రశ్న అనవసరం. పెరిగిపోతున్న ద్రవ్యలోటు, రికార్డుస్థాయి కరెంటు ఖాతా లోటును గమనిస్తే, దేశంలోనికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులే (ఎఫ్.డి.ఐ) శ్రేయస్కరమని అంగీకరించకతప్పదు. ఎందువల్లనంటే, స్టాక్‌మార్కెట్‌లోకి ప్రవహించే మఖలో వచ్చి పుబ్బలో పోయే స్వభావమున్న విదేశీ సంస్థాగత పెట్టుబడుల వల్ల (ఎఫ్ఐఐ) దేశంలో సంక్షోభం ముదురుతుంది. ఉద్యోగాలను సృష్టించే పెట్టుబడి, మన పిల్లల మీదకు భారాన్ని నెట్టే అప్పులకన్నా ఎప్పుడూ నయమే.

ఉత్పాదకత సమస్యలపై, నూనెగింజలు, పప్పుధాన్యాలు, ఇతర ఉత్పత్తులలో నెలకొన్న తీవ్రస్థాయి లోపాలపై కనీసస్థాయి దృష్టిని కూడా మనం పెట్టకపోతే వ్యవసాయ ఆదాయాలపై మనం చేసే ఏరకమైన ప్రామాణిక చర్చయినా అసంపూర్తిగానే ఉంటుంది. హరిత విప్లవ సమయంలో వ్యవసాయ విశ్వవిద్యాలయాలతో కలిసి ఐ.సి.ఎ.ఆర్ ప్రశంసనీయస్థాయి కృషి చేసింది. కానీ ఇటీవలి సంవత్సరాలలో, చాలా విశ్వవిద్యాలయాలు చరమదశకు చేరుకున్నాయి. మనం ఆహారభద్రతకు, రైతులకు ఆదాయాలకు  గ్యారంటీ ఇవ్వటానికి కీలకమైన పరిశోధనలకు నిధుల కేటాయింపును, నాణ్యమైన శాస్త్రవేత్తలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాలలో, జన్యుమార్పిడితో మెరుగైన వంగడాల తయారీలో, తెగుళ్ల నియంత్రణ,

భూసార నిర్వహణ, కరవును తట్టుకోవటం, దిగుబడి అనంతర సాంకేతిక పరిజ్ఞానం, జీవసాంకేతిక పరిజ్ఞానంలోని నూతన అంశాలలో గణనీయ పెట్టుబడులు అవసరం. పోటీతత్వం, ప్రపంచీకరణ ఉన్న అంతర్జాతీయ వ్యవస్థలో భారతదేశం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటుండాలి. మనరైతులకు, పరిశ్రమలకు అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానం కావాలి. లేకుంటే, గుత్తాధిపత్యాలు, బహుళ జాతి సంస్థలు మనల్ని నిర్దాక్షిణ్యంగా దోచేస్తాయి.

జన్యుపరంగా మార్పిడి చేసిన పంటలపై పెద్దఎత్తున ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మనం వాణిజ్యం, గుత్తాధిపత్యాలకు సంబంధించిన అంశాల నుంచి టెక్నాలజీని వేరు చేసి చూడాలి. మన భవిష్యత్తుకు జన్యు పరిశోధన, జన్యుమార్పిడి పంటలు కీలకమని నిబద్ధతగల ఏ జీవశాస్త్రవేత్తకయినా తెలుసు. హీలియోథిస్‌ను తట్టుకునే రకాలను అభివృద్ధి చేయటం ద్వారా బి.టి పత్తి అనూహ్యంగా దిగుబడులను పెంచింది. పురుగుమందుల వినియోగాన్ని తగ్గించింది. మన నూనెగింజల ఉత్పత్తిలో విప్లవాత్మక మార్పు తెచ్చి మెట్టప్రాంత రైతుల ఆదాయాల్ని మెరుగుపరిచేలా ఇక్రిశాట్ (ఐ.సి.ఆర్.ఐ.ఎస్.ఎ.టి) జన్యుమార్పిడి వేరుశెనగను అభివృద్ధి చేస్తోంది. సోయాచిక్కుడు, మొక్కజొన్న, ఇతర జన్యుమార్పిడి పంటలు ఇప్పటికే ప్రపంచ వ్యవసాయాన్ని మార్చివేస్తున్నాయి. గత దశాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా సుమారు వందకోట్ల హెక్టార్లలో జన్యుమార్పిడి (జి.ఎం) పంటల్ని వేశారు. ప్రస్తుతం జన్యుమార్పిడి పంటల సాగు విస్తీర్ణం 16 కోట్ల హెక్టార్లుగా ఉంది. డయాబెటిక్ రోగులు ఉపయోగించే బోవైని ఇన్సులిన్‌లో ఇన్సులిన్ నిరోధకశక్తిని తొలగించేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉపయోగించే మానవ ఇన్సులిన్ జన్యుమార్పిడి వైద్య ఉత్పత్తే. అమెరికా, బ్రెజిల్, చైనా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, కెనడా, అన్ని ప్రధాన వ్యవసాయ ఉత్పత్తి దేశాలు తమ ఉత్పాదకతను, ఆహార నాణ్యతను, ఆదాయాన్ని, పౌష్టిక విలువల్ని పెంచుకునేందుకు జి.ఎం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నాయి.

కొన్ని బహుళ జాతి సంస్థల (ఎం.ఎన్.సిల) గుత్తాధిపత్యాన్ని నిరోధించేందుకు ఖచ్చితంగా అన్ని నియంత్రణాచర్యల్ని తీసుకోవాల్సిందే. మన విశ్వవిద్యాలయాలలో జి.ఎం పరిశోధనల్ని, ల్యాబరేటరీలలో ఐ.సి.ఎ.ఆర్ పరిశోధనల్ని ప్రోత్సహించటంతోపాటు రైతులకు భద్రత కల్పించేందుకు మనం అనేక చర్యల్ని చేపట్టాల్సి

ఉంది. ప్రపంచస్థాయి అవగాహన, సమన్వయం ఉన్న శాస్త్రవేత్తలనే నియంత్రణా సంస్థలలోకి ఎంపికచేయాలి. స్వార్థశక్తులు పాగా వేయకుండా నిర్ణీత పదవీకాల పరిమితిని పెట్టి తిరిగి నియామకానికి అవకాశం లేకుండా చేయాలి. తొలుత అభివృద్ధి చేసిన ఎంటర్‌ప్రెన్యూర్‌లకు హేతుబద్ధమైన ధర లభించేలా, గుత్తాధిపత్యంతో ధరలతో దోపిడీ చేయకుండా జి.ఎం విత్తనాలకు న్యాయబద్ధమైన ధరను నిర్ణయించేందుకు స్వతంత్ర ప్రతిపత్తిగల నియంత్రణా వ్యవస్థను ఏర్పాటు చేయాలి. సాంకేతిక పరిజ్ఞానంపై పరిమిత కాలం వరకే గుత్తాధిపత్యం ఉండేలా పేటెంట్ చట్టాల్ని సవరించాలి.

మన రైతుల్ని, జాతీయ ప్రయోజనాల్ని పరిరక్షించేందుకు ఈ చర్యలన్నిటినీ తీసుకోవాలి. గుత్తాధిపత్యాలకపట్ల ఆగ్రహంతో మనకు సాంకేతికపరిజ్ఞానం వద్దని దూరం చేసుకోవటం ముఖం మీద కోపంతో ముక్కును తెగనరుక్కోవటంలాంటిది. మన వ్యవసాయ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలంటే, భారతదేశం స్థాయి పెద్ద ఆర్థికవ్యవస్థకఖచ్చితంగా అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాలను అందిపుచ్చుకోవాలి. మనకు మనమే టెక్నాలజీలను తిరస్కరించుకుని తోసిపుచ్చటం స్నానం తొట్టి నీటితోపాటు బిడ్డను కూడా విసిరేయటమే అవుతుంది.

మన వ్యవసాయాన్ని శక్తివంతమైన, ప్రపంచ స్థాయిలో పోటీపడగల, వేగంగా అభివృద్ధిని సాధించగల, ఉద్యోగావకాశాలను సృష్టించగల రంగంగా తీర్చిదిద్దుకోగల శక్తి భారత్‌కు ఉంది. మన ఆర్థికవ్యవస్థకు ఏదైతే భారంగా కనిపిస్తోందో ఆ వ్యవసాయరంగమే అభివృద్ధికి చోదకశక్తి కాగలదు. పేదరికానికి బదులు అభివృద్ధిని, వరాలు, తాత్కాలిక పథకాలకు బదులు అవకాశాల్ని, ప్రభుత్వ నియంత్రణలకు బదులు స్వేచ్ఛని మనం ఎంచుకోవాలి. తీవ్ర అవరోధాలకు, ఆటుపోట్లకు, అడుగడుగునా బంధనాలకూ ఎదురొడ్డి మన రైతులు గొప్ప ఫలితాలను సాధించి చూపారు. ఒక్కసారి సంకెళ్లను తొలగిస్తే, సరైన ప్రోత్సాహకాలను అందిస్తే చాలు, భారతీయ రైతులు ప్రపంచంలో ఎవరితోనైనా దీటుగా పోటీపడగలరు. అప్పుడే మన గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో సమూల మార్పు వస్తుంది. ★

# జి.యం విత్తనాలు – రైతు ప్రయోజనాలు

మనదేశ స్థూలజాతీయోత్పత్తిలో వ్యవసాయరంగం వాటా కేవలం 15శాతమే ఉన్నప్పటికీ, ఈ రంగం ద్వారా దేశ జనాభాలో 55శాతం మంది పొట్టపోసుకుంటున్నారు. వ్యవసాయం మీద ఆధారపడి బతుకుతున్నవారి తలసరి ఆదాయం మిగిలిన జనాభా తలసరి ఆదాయంలో ఆరోవంతు కంటే తక్కువగా, 16శాతం మాత్రమే ఉందని చెప్పటానికి పెద్ద లెక్కల పరిజ్ఞానం అక్కర్లేదు. స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయం వాటా క్రమంగా దిగజారిపోతోంది. కానీ, వ్యవసాయం మీద ఆధారపడిన జనాభా సంఖ్య మాత్రం అదేస్థాయిలో తగ్గటం లేదు. ఫలితంగా, గ్రామీణ ప్రాంతంలో అశాంతి, వ్యవసాయ సంక్షోభం రోజురోజుకీ తీవ్రతరమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, పంటల ఉత్పాదకతను, రైతుల, కౌలుదారుల ఆదాయాన్ని పెంచటం ఓ కీలక జాతీయ ప్రాధాన్యతాంశంగా మారింది.

వ్యవసాయరంగ అభివృద్ధి మొత్తం సంకర రకాల తయారీ, హైబ్రిడ్‌ల, భారీ దిగుబడులనిచ్చే రకాల అభివృద్ధి, ఆశించిన జన్యులక్షణాలతో కూడిన మొక్కల రకాల్ని ఎంపిక చేసుకోవటంతోనే ముడిపడి వుంటుంది. ఆ విధంగానే మానవజాతి



వ్యవసాయంలో నైపుణ్యాన్ని సాధించి అదనపు ఉత్పత్తులను సాధించగలిగింది. హరిత విప్లవానికి నాంది పలకటం ద్వారా మానవజాతికి నభూతో అనేరీతిలో మేలుచేసిన డా॥ నార్మన్ బోర్లాగ్ కృషిని మన విధాననిర్ణేతలు, శాస్త్రవేత్తలు, పాలనాయంత్రాంగం సమర్థవంతంగా అందిపుచ్చుకున్నారు. బోర్లాగ్ ఆనాడు సాధించిన మహత్తర విప్లవం జన్యు పరిజ్ఞానాన్ని అన్వయించటం, లక్ష్యాలకు అవసరమైన జన్యులక్షణాలను ఎంపికచేసుకుని విస్తృత ప్రచారం చేయటం ద్వారానే సాధ్యమైంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు భారతదేశ ఆహారోత్పత్తి 5.2 కోట్ల టన్నుల మేర ఉంటే, ఈవేళ మంచి సీజన్ సమయంలో ఎఫ్.సి.ఐ గిడ్డంగులలో నిల్వ వున్న ఆహారధాన్యాలే 8.3 కోట్ల టన్నులు ఉన్నాయంటే, నాటి జన్యుపరిజ్ఞాన ఆధారిత హరిత విప్లవమే అందుకు ప్రధాన కారణం. వ్యవసాయం వృద్ధి చెందాలంటే ఎప్పటికప్పుడు నూతన జన్యు సాంకేతిక పరిజ్ఞానాలను అనుసరించాల్సిందే.

పంటలలో జన్యు ఇంజినీరింగ్ అంటే, ఒక మొక్క జినోమ్‌లో జీన్-స్ప్లయిసింగ్ టెక్నిక్కుల ద్వారా డి.ఎన్.ఎ శకలాలని ఎంపిక చేసుకున్నరీతిలో ప్రవేశపెట్టటం మాత్రమే. ఈ ప్రక్రియ ద్వారా ఆ మొక్కకు తెగుళ్లను తట్టుకునే, కరవును తట్టుకునే లక్షణాలతోపాటు మెరుగైన దిగుబడి, పౌష్టిక విలువలు వంటి మనం ఆశిస్తున్న లక్షణాలు సమకూరతాయి. ఎంపిక చేసిన మొక్కల్ని అంటుకట్టి అభివృద్ధి చేయటం ద్వారా సంప్రదాయ జన్యుమార్పిడి జరుగుతుంటుంది. అదే జన్యుమార్పిడి (జి.ఎం) సాంకేతిక పరిజ్ఞానానికొస్తే, శాస్త్రవేత్తలు ఆ ఆశించిన లక్షణాలను ఎంతో వేగంగా, ఖచ్చితత్వంతో సాధించగలుగుతారు. కాబట్టి, పేదరికంపై పోరాటంలో, ఆహారభద్రతను సాధించుకోవటంలో జి.ఎం సాంకేతిక పరిజ్ఞానం ఒక కీలకసాధనం.

ప్రపంచవ్యాప్తంగా జన్యుపరివర్తన రకం వ్యవసాయ, ఆహార పంటల సాగువిస్తీర్ణం మొత్తం ఇప్పటివరకూ 100 కోట్ల హెక్టార్ల మేర ఉంటుంది. ప్రస్తుతం ఏటా 16 కోట్ల హెక్టార్లలో జి.ఎం పంటల్ని పండిస్తున్నారు.

జి.ఎం పంటల్ని ప్రవేశపెట్టేముందు వాటికి కఠిన పరీక్షలు, తనిఖీలు జరుపుతారు. పటిష్టమైన నియంత్రణా చర్యలు అమలులో వున్నాయి. ఇప్పటిదాకా దాదాపు 15 ఏళ్ల నుంచి ఆ సాంకేతికపరిజ్ఞానం వినియోగంలో ఉంది. మంచి ఫలితాలనిచ్చింది.

1970వ దశకం చివర్లో భారత్ పొడుగురకం (లాంగ్–స్టేపుల్డ్) హైబ్రిడ్ పత్తిని అభివృద్ధి చేసింది. దాంతో, కేవలం ఒక దశాబ్దకాలంలోనే, ఉన్నత నాణ్యతాప్రమాణాలు గల పత్తి ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. కానీ, 1990వ దశకం చివరికొచ్చేటప్పటికి పత్తి పంట రెసిస్టెంట్ హెలియోథిస్ (బోల్‌వార్మ్) రూపంలో తీవ్రతరమైన తెగులు బారినపడింది. ఎన్ని పురుగుమందులు చల్లినా ఆ గొంగళిపురుగు అదుపుకాలేదు.

రైతులు భారీ నష్టాల పాలయ్యారు. 1980వ దశకం చివరికొచ్చేసరికి పలువురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. పత్తి ఉత్పత్తి పడిపోయింది. హీలియోథిస్‌ను తట్టుకోగల జన్యువు బ్యాసిల్లస్ థురింజన్ (బి.టి) అనే క్రిమిలో ఉందని కొన్నేళ్ల తర్వాత గుర్తించారు. జన్యుమార్పిడి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఆ జన్యువును పత్తి విత్తనాలలో ప్రవేశపెట్టారు. ఆ విధంగా పురుగు దాడుల్ని బి.టి పత్తి తట్టుకోగలిగింది. ఫలితంగా, పత్తిసాగులో భారత్ విప్లవాత్మక ప్రగతి సాధించింది. ప్రస్తుతం మనదేశంలో పత్తి సాగు జరుగుతున్న 3కోట్ల ఎకరాలలో 95శాతం మేర బి.టి పత్తి విత్తనాలనే వినియోగిస్తున్నారు. ప్రస్తుతం మన పత్తి ఉత్పత్తి 3.3కోట్ల బేళ్లు. చైనా తర్వాతి స్థానం మనదే. రాబోయే కొన్నేళ్లలో చైనాను సైతం పత్తి ఉత్పత్తిలో భారత్ అధిగమిస్తుందని అంచనా. పురుగు మందుల వినియోగం బాగా తగ్గటంతో, పర్యావరణం మెరుగుపడింది. పత్తి ఎగుమతుల్ని చేసే ప్రధాన దేశంగా భారత్, ఎంతో విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించగలుగుతోంది. వ్యవసాయం మీదగానీ, ఆరోగ్యం మీదగానీ ఎటువంటి దుష్పరిణామాలు లేవు. పత్తి విత్తనాలను పశువులకు ఆహారంగా వినియోగిస్తున్నారు. పత్తి విత్తనాల నుంచి తీసిన నూనెను వంటలలో వాడుతున్నారు. ఆ ఉత్పత్తుల్ని ఆహారంలో భాగంగా వినియోగిస్తున్న పశువులకు, మనుషులకు ఎటువంటి హానిలేదని, పూర్తిభద్రతతో కూడుకున్నవని ప్రపంచవ్యాప్తంగా రుజువైంది.

కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనె గింజలలో అనేక జన్యుపరివర్తన సాంకేతిక పరిజ్ఞానాలను ఇప్పుడు అభివృద్ధి చేస్తున్నారు. ఉదాహరణకు, హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే మెట్టప్రాంత పంటల అంతర్జాతీయ పరిశోధనా సంస్థ ఇక్రిశాట్ (ఐ.సి.ఆర్.ఐ.ఎస్.ఎ.టి) ప్రస్తుతం జన్యుమార్పిడి వేరుశెనగ అభివృద్ధి కోసం కృషి చేస్తోంది. నూనెగింజల కొరతనుఎదుర్కొంటున్న భారతదేశం ప్రస్తుతం ఎంతో డబ్బును వెచ్చించి 1కోటి టన్నుల వంటనూనెల్ని దిగుమతి చేసుకుంటోంది. జన్యుమార్పిడి

విత్తనాలు మన మెట్టప్రాంత నూనెగింజల ఉత్పత్తిని విప్లవీకరించి, మహబూబ్‌నగర్, అనంతపురం వంటి ప్రాంతాలలో చిన్న రైతుల ఆదాయాన్ని పెంచగలుగుతాయి. దిగుమతులు అక్కర్లేకుండా భారతదేశ ఆహారభద్రతకు భరోసా ఇవ్వగలుగుతాయి. అదేవిధంగా విటమిన్–డి తో కూడిన బియ్యాన్ని ఇప్పుడు జన్యుపరివర్తన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అభివృద్ధి చేస్తున్నారు. ఈ రకం బియ్యం, ఇలాంటి ఇతర రకాల జి.ఎం ఉత్పత్తులు కోట్లాదిమంది మన ప్రజలలో పౌష్టికలోపాల్ని, ఆహారసమస్యను గణనీయంగా తగ్గించగలుగుతాయి.

టైప్–1 డయాబెటిస్, ఇన్సులిన్‌ను నిరోధించే టైప్–2 డయాబెటిస్‌కరోగులకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రాణరక్షణ మందు మానవ ఇన్సులిన్ జన్యుసాంకేతిక మార్పిడి సాంకేతిక పరిజ్ఞానంతో తయారైనదే. మానవ ఇన్సులిన్‌ను తయారుచేసేంతవరకూ, పశువుల నుంచి సేకరించిన బవైన్ ఇన్సులిన్ ఒక్కటే చికిత్సామార్గంగా ఉండేది. దానివల్ల ఇన్సులిన్ మీద ఆధారపడిన అనేకమంది డయాబెటిక్ రోగులలో ఇన్సులిన్ నిరోధం పెరగటంతోపాటు ప్రాణహాని చేసే రకరకాల దుష్పరిణామాలు పెరిగేవి. ఇప్పుడు మానవ ఇన్సులిన్ కోట్లాదిమంది డయాబెటిస్ రోగులకి ప్రాణదాత అవుతున్నది.

సాంకేతిక ఆవిష్కరణల ద్వారా మానవజాతి ఎప్పుడూ పురోగమిస్తూనే వచ్చింది. మొత్తం ప్రపంచంలోని భూమిలో భారత్ 2.5శాతం మాత్రమే ఉన్నప్పటికీ, ప్రపంచ సాగువిస్తీర్ణంలో మనకు 11శాతం ఉంది. అటువంటి సువిశాల సాగుభూమి, పుష్కలమైన సూర్యరశ్మి, మంచి వర్షపాతం, వేలసంవత్సరాల పటిష్ఠమైన వ్యవసాయ సంస్కృతి– మనం ప్రపంచస్థాయి వ్యవసాయ దిగ్గజంగా ఎదగటానికి, మన వ్యవసాయాన్ని ఆర్థికాభివృద్ధికి చోదకశక్తిగా మలచుకునేందుకు వెలకట్టలేని అవకాశాన్ని అందిస్తున్నాయి. ఈ లక్ష్యం సాకారం కావాలంటే, శాస్త్రీయంగా నిరూపితమైన అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందుబాటులోకి తేవాలి. భారత్ వంటి సత్తాగల పెద్ద దేశం నూతన సాంకేతిక పరిజ్ఞానాలను తోసిపుచ్చలేదు. అమెరికా, బ్రెజిల్, చైనా, రష్యా, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, కెనడా, ఇతర పెద్ద వ్యవసాయ దేశాలు తమ ఉత్పత్తులను, ఉత్పాదకతను పెంచుకునేందుకు జన్యుపరివర్తన సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటున్నాయి. సోయా చిక్కుడు, మొక్కజన్న, ఇతర జి.ఎం పంటలు

ఇప్పటికే ఆయా దేశాల నుంచి పెద్దఎత్తున వస్తూ ప్రపంచ వ్యవసాయ ముఖచిత్రాన్నే మారుస్తున్నాయి. ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని తోసిపుచ్చి వ్యవసాయంలో నామమాత్రంగా మిగిలిపోయేందుకు భారత్ సిద్ధంగా లేదు.

జన్యుమార్పిడి సాంకేతికపరిజ్ఞానంలో బహుళ జాతిసంస్థల (ఎం.ఎన్.సిల) గుత్తాధిపత్యాన్ని నివారించేందుకు మనం సాధ్యమైన అన్ని చర్యల్నీ తీసుకోవాల్సిందే. రైతులకు లాభం చేకూర్చేలా జి.ఎం రకాలను ప్రభుత్వరంగంలో అభివృద్ధి చేసేందుకు ఐ.సి.ఎ.ఆర్, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, శాస్త్రవేత్తలు అవసరమైన దిద్దుబాటు చర్యల్ని తీసుకోవటం అవసరం. కొన్నేళ్ల క్రితం బి.టి పత్తి సాంకేతిక పరిజ్ఞానాన్ని, జర్మ్ ప్లాసంను ప్రైవేటు సంస్థలు ఆకర్షణీయమైన ఒప్పందంతో ఇచ్చేందుకు సుముఖత చూపినా, కొనుగోలుకు ఐ.సి.ఎ.ఆర్ నిరాకరించింది. ఆ తప్పిదానికి భారత్ పెద్ద మూల్యం చెల్లిస్తోంది. మనం ఇప్పుడు జి.ఎం పరిశోధనను పెంపొందించుకోవాల్సుంది.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవటానికి, గుత్తాధిపత్యాల ప్రమాదానికి మధ్య మనం గందరగోళానికి లోనవకూడదు. మనకు సాంకేతిక పరిజ్ఞానం కావాలి, కానీ అదేసమయంలో మనం గుత్తాధిపత్యాల్ని నిరోధించాలి. గుత్తాధిపత్యాల భయంతో మనం టెక్నాలజీని వదులుకోలేం. అలా చేస్తే కొండ నాలుకకి మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయినట్టవుతుంది.

బి.టి పత్తి విత్తనాల మార్కెట్‌లో చాలా పెద్దవాటా కలిగిన మోన్‌శాంటో అనే బహుళ జాతి కంపెనీకి వ్యతిరేకంగా లోక్‌సత్తా పోరాడింది. మోన్‌శాంటో సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన బి.టి పత్తి విత్తనాల జన్యుప్రత్యేకతల విలువను తగ్గించాలని, చైనాలోలాగా తక్కువ ధరలకు వాటిని అమ్మాలని ప్రకటించాలని కోరుతూ 2006లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో లోక్‌సత్తా ఒక రిట్ పిటిషన్ (డబ్ల్యుపి నెం.5505 ఆఫ్ 2006)ను దాఖలు చేసింది. ఆ పిటిషన్‌లోని అంశాలను ప్రాతిపదికగా తీసుకునే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎం.ఆర్.టి.పి కమిషన్ ముందు మోన్‌శాంటో బి.టి విత్తనాల ధరకు వ్యతిరేకంగా ఫిర్యాదు (ఆర్.టి.పి.ఎ నెం.2/2006) చేసింది. 8-12-2009న ఆ ఫిర్యాదును పరిష్కరించి, బి.టి పత్తి విత్తనాల ధరను తగ్గిస్తూ కమిషన్ ఆదేశం జారీచేసింది. లోక్‌సత్తా చొరవ, ప్రభుత్వ సానుకూల స్పందన కలిసి విత్తనాల ధరను గణనీయంగా తగ్గించగలిగాయి.

నియంత్రణలకు, గుత్తాధిపత్యాలకు, మితిమీరిన ధరలకు సంబంధించిన అంశాలపై పోరాటం, జన్యుమార్పిడి సాంకేతిక పరిజ్ఞానాన్ని విలువను గుర్తించి వినియోగించుకోవటం– రెండూ వేర్వేరు అంశాలు అనటానికి 2006లో బి.టి విత్తనాల ధర తగ్గించిన వైనమే స్పష్టమైన ఉదాహరణ. సాంకేతిక పరిజ్ఞానం వల్ల ప్రయోజనాలని, సురక్షిత, గుత్తాధిపత్యాలకు వ్యతిరేకంగా రక్షణచర్యల్ని ఒకేగాటన కట్టి గందరగోళ పడకూడదు.

అసాధారణ ధరలు లేకుండా హేతుబద్ధమైన ధరల్ని నిర్ణయించేందుకు స్వతంత్ర ప్రతిపత్తిగల నియంత్రణా సంస్థ అవసరం. విత్తనాల్ని తయారుచేసి అభివృద్ధి చేసినవారికి న్యాయమైన ధర లభించేలా, రైతులకు విత్తనాలు అందుబాటు ధరలలో దొరికేలా స్వతంత్ర ప్రతిపత్తిగల నియంత్రణా సంస్థ నిర్దిష్ట చర్యలు తీసుకోవాలి. ఆ విధమైన ఏర్పాటుకు తగు ఆదేశం ఇవ్వాలని సుప్రీంకోర్టు ముందున్న కేసు విచారణలో దాఖలు చేసిన దరఖాస్తులో లోక్‌సత్తా కోరింది.

బయోటెక్నాలజీ నియంత్రణా సంస్థలలో ఆ రంగంలో ప్రపంచస్థాయి అవగాహన, సమన్వయం ఉన్న నిపుణులు మాత్రమే ఉండేలా ఏర్పాటు చేయాలి. స్వార్థశక్తులు పెరగకుండా, ఎప్పటికప్పుడు ఆవిష్కృతమయ్యే నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేలా, నియంత్రణాసంస్థలోని నిపుణులకు నిర్ణీత కాలవ్యవధిని ఏర్పాటుచేయాలి. ఉదాహరణకు, మూడేళ్లు మించి ఎక్కువకాలం కొనసాగే అవకాశం ఇవ్వకూడదు.

భారతీయ చట్టం ప్రకారం, పేటెంట్‌దారులు భారత్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న నాటి నుంచి 20 ఏళ్ల పాటు ఆ సాంకేతిక పరిజ్ఞానంపై గుత్తాధిపత్యాన్ని కలిగివుంటారు. బహుళ జాతి సంస్థలు ఈ నిబంధనను ఉపయోగించుకుని, తమ ఉత్పత్తులు వాణిజ్య ప్రాచుర్యం పొందాకే భారత్‌లో పేటెంట్లు రిజిస్టర్ చేస్తున్నారు. అటువంటి గుత్తాధిపత్య ధోరణుల్ని తగ్గించటానికి చట్టాన్ని సవరించాలి. దాంతోపాటు, కంపెనీలు ఇప్పుడున్న సాంకేతిక పరిజ్ఞానాలలోనే చిన్న, అప్రాధాన్యమైన, పైపై మార్పులు చేసి వాటికి 20 ఏళ్ల పేటెంట్ తీసుకునే ప్రమాదం కూడా ఉంది. అలాంటి వాటన్నిటి నుంచీ పేటెంట్ అథారిటీ రక్షణ కవచాల్ని ఏర్పాటు చేయాలి.

మనదేశ ప్రయోజనాన్ని, రైతుల ప్రయోజనాల్ని పరిరక్షించేందుకు వీటన్నిటితోపాటు ఇంకా అవసరమైన ఇతర చర్యల్నీ చేపట్టాలి. అంతేతప్ప, ఎంఎన్‌సిల పట్ల వ్యతిరేకతతో సాంకేతిక పరిజ్ఞానం వద్దనుకోవటం ముఖం మీద కోపంతో ముక్కును తెగ్గోసుకున్న చందంగా ఉంటుంది. అది ఏకోణంలోనూ సరైన పంథా కాదు.

సాంకేతికాభివృద్ధి ద్వారా, ఉత్పత్తిని పెంచుకునేందుకు శాస్త్రీయంగా నిరూపితమైన సాంకేతిక పరిజ్ఞానాలను అనుసరించటం ద్వారా, స్వేచ్ఛాయుత, న్యాయబద్ధమైన మార్కెట్లను నిర్మించటం ద్వారా, గుత్తాధిపత్యాలను నిర్మూలించటం ద్వారా, నిరంతర ఆవిష్కరణల ద్వారా మానవాళి పురోగమిస్తూ, అభివృద్ధి చెందుతూ వస్తోంది. భారతీయ వ్యవసాయానికి అటువంటి ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానాలు కావాలి. సాంకేతిక పరిజ్ఞానాలను పరిశీలించి ప్రజాప్రయోజనాల్ని పరిరక్షించే బాధ్యతను శాస్త్రవేత్తలకు, సమర్థవంతమైన నియంత్రణా వ్యవస్థలకు అప్పచెప్పాలి. కానీ అతి భయాందోళనలు, గుత్తాధిపత్యాల పట్ల వ్యతిరేకత మనల్ని గాడితప్పేలా చేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని వదులుకునేలా చేయకూడదు. ఆధునిక యుగం అందిస్తున్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాలు మనకు వ్యవసాయంలో అవసరం. అయితే రెండు రక్షణ కవచాలతో: ఒకటి, సురక్షితత్వానికి, మంచి ఫలితాలకు సంబంధించి తగిన సామర్థ్యంగల సంస్థలు పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవటం, రెండు, రైతులకు నష్టంచేకూర్చేరీతిలో ఎటువంటి గుత్తాధిపత్యాలు తలెత్తకుండా అన్నిరకాలుగా పటిష్ట చర్యల్ని తీసుకోవటం. ★



# ఎఫ్‌డిఐ అంటే భయం ఎందుకు?

చిల్లర వ్యాపారంలో పరమితులకు లోబడి ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులను అనుమతించాలని సెప్టెంబర్ 14న కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ చర్చలో రెండు వైపులా అనవసరమైన భావోద్వేగాలు, మితిమీరిన ప్రచారం వ్యక్తం అవుతున్నాయి. ఈ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులను అనుమతించడం వల్ల భారీ స్థాయిలో ఉన్న, వైవిధ్యభరితమైన మన ఆర్థిక వ్యవస్థ స్వరూప స్వభావాలు మారిపోతాయన్న వాదనలు సమర్థనీయంగా లేవు. ఈ పెట్టుబడులు సర్వ వినాశనానికి దారితీస్తాయన్న విమర్శలు కూడా నిలబడేవి కావు.

సమతుల్యతతో కచ్చితమైన నిర్ధారణకు రావడానికి మనం ఆవేశాలకు తావివ్వకుండా మూడు కీలకాంశాలను పరిశీలించాలి. అవి:– ప్రత్యక్ష ప్రయోజనాలు, ముప్పుద పెట్టుబడి, అభివృద్ధిపై పడే ప్రభావం; కరెంట్ అకౌంట్ లోటుపై ప్రభావం.

ముందు ప్రత్యక్ష ప్రభావం ఏమిటో చూద్దాం. దీనివల్ల కచ్చితంగా ఒనగూడే ప్రయోజనాలతో పాటు ముప్పు ఉంది. భారత వ్యవసాయరంగం దీర్ఘకాలిక సంక్షోభంలో కూరుకుపోయి ఉంది. స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగం




వాటా ఏయేటికాయేడు తగ్గిపోతోంది. ఇప్పుడు ఆ వాటా 15 శాతం ఉంది. కానీ వ్యవసాయంపై ఆధారపడే జనాభా సంఖ్య క్రమంగా తగ్గుతోంది. ప్రస్తుతం వ్యవసాయం మీద ఆధారపడే వారు 50శాతం మంది ఉన్నారు. దేశ జనాభాలోని 50 శాతం మంది తలసరి ఆదాయం మిగతా జనాభా తలసరి ఆదాయంలో 18శాతం మాత్రమే ఉంది. ఈ వ్యవహారాన్ని యుద్ధ ప్రాతిపదిక మీద చక్కదిద్దాల్సి ఉంది. ఈ దిశగా అనేక ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అందులో ప్రధానమైంది గ్రామీణుల ఆదాయం పెంచడానికి ఉద్దేశించిన జాతీయ గ్రామీణ ఉపాధి పథకం. కానీ గ్రామీణ సంపద సృష్టించడానికి, అదనపు విలువ సమకుర్చడానికి ప్రత్యామ్నాయం లేదు.

ప్రస్తుతం రైతుకు, వినియోగదారుడికి మధ్య అత్యంత అసమర్థమైన, సుదీర్ఘమైన మార్కెట్ వ్యవస్థ ఉంది. ఈ కారణంగా అనేక వ్యవసాయ ఉత్పత్తులకు రైతుకు దక్కేది వినియోగదారుడు చెల్లించే ధరలో కేవలం 35 శాతం మాత్రమేనని అనేక అధ్యాయనాల్లో తేలింది. ఎక్కువ కాలం నిలవ ఉండని ఉత్పత్తుల విషయంలో అయితే రైతులకు దక్కుతున్నది 12 నుంచి 20 శాతం మాత్రమే. రవాణాసదుపాయాలు, ఉత్పత్తులను నిలవ చేసే అవకాశాలు, మౌలిక సదుపాయాలు కొరత కారణంగా ధరలో విపరీతమైన ఎగుడు దిగుళ్లు ఉంటున్నాయి. దాదాపు 200 మిలియన్ మెట్రిక్ టన్నుల పళ్లు, కూరగాయాలు ఉత్పత్తి అవుతూ ఉంటే 23.6 మిలియన్ మెట్రిక్ టన్నులను మాత్రమే నిలవ చేసే సామర్థ్యం ఉన్న శీతల గిడ్డంగులు అందుబాటులో ఉన్నాయి. దీనిలోనూ 80శాతం బంగాళ దుంపలను నిలవ చేయడానికే వినియోగిస్తున్నాం. నిలవ ఉండే ధాన్యం వంటి వాటిలో కూడా నిలవ చేయడానికి సరైన సదుపాయం లేనందు వల్ల 10 శాతం వృధా అవుతున్నాయి. త్వరగా పాడైపోయే ఉత్పత్తుల ధరల్లో మరింత ఎగుడు దిగుళ్లు ఉన్నాయి. ఉదాహరణకు కిలో టొమాటోల ధర ఒకప్పుడు అర్థ రూపాయి ఉంటే మరోసారి 30 రూపాయల దాకా ఉంటుంది. నిలవ ఉండే పసుపు వంటి వాటి ధరకూడా క్వింటాలుకు రూ॥1600 నుంచి రూ॥4000 దాకా మారిపోతూ ఉంటుంది. వినియోగదారుడు ఎక్కువ ధర చెల్లిస్తుంటే రైతుకు తక్కువ ధరే దక్కుతోంది.

మనం మూడు చర్యలు విధిగా తీసుకోవాల్సి ఉంది. రైతు నుంచి వినియోగదారుడికి

మధ్య మార్కెట్ దూరం బాగా తగ్గాలి. నాణ్యత ఆధారంగా సరుకును వర్గీకరించడం, రవాణా, నిలవ సదుపాయాలను ఆధునీకరించాలి. త్వరగా పాడైపోయే ఉత్పత్తులను మూల్యవర్ధిత (Value added) సరుకులుగా మార్చి సంపదను సృష్టించాలి. ఉద్యోగాలు కల్పించాలి. వీటన్నింటికీ పెట్టుబడి, మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం, నిర్వహణా సామర్థ్యంలాంటివి అవసరం. ప్రస్తుతానికి చిల్లర వ్యాపారంలో వరస అమ్మకం కేంద్రాలను నెలకొల్పే భారతీయ సంస్థలపై ఎలాంటి ఆంక్షలూ లేవు. కానీ అవి అంతగా ప్రభావం చూపలేక పోయాయి. భారతీయ పరిశ్రమలు సాధారణంగా బహుళ జాతి కంపెనీలను వ్యతిరేకిస్తాయి. పోటీని సహించవు. కానీ చిల్లర వ్యాపారానికి సంబంధించినంత వరకు పరిశ్రమలు సరళీకరణ కావాలంటున్నాయి. సరుకు నిలవ చేయడం వంటి విషయాల్లో అరకొర సరళీకరణ వల్ల ఎక్కువ పెట్టుబడి సమకూరలేదు.

ఈ కీలక రంగంలో ఎవరు పెట్టుబడి పెడతారు అన్నది నిజానికి అంత ముఖ్యం కాదు. “పిల్లి నల్లదో తెల్లదో అన్న దానితో నిమిత్తం లేదు. ఎలకలను పడితే చాలు” అని డెంగ్జియావ్ పింగ్ అనే వారు. మార్కెట్‌కు దూరం తగ్గడం, నమ్మకం కలిగించే రవాణా తదితర సదుపాయాలు, మూల్యవర్ధన చర్యలు మొదలైన వాటిని వ్యవస్థీకృత చిల్లర వ్యాపార సంస్థలు సమకూరుస్తాయి. దాని వల్ల రైతుకు సరైన ధర అంది



వినియోగ దారుడికి చౌకగా సరుకు అందుతుంది. సమర్థంగా, పోటీ వల్ల వ్యాపారులకు లాభాలు తగ్గుతాయి. కాని అధిక మొత్తంలో సరుకు అందడం వల్ల ఆ లోటు పూడ్చుకోగలుగుతారు. అంతకన్నా ముఖ్యమైంది. సరుకు వృథా కావడం తగ్గుతుంది. వ్యవసాయ ఉత్పత్తులను ప్రొసెస్ చేయడం నిలవ చేయడం, వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు స్ఫూర్తి కలుగుతుంది. తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. పట్టణీకరణ సక్రమంగా జరుగుతుంది. ధరలలో హెచ్చుతగ్గుల బాధ బాగా తగ్గుతుంది.

మార్కెట్లు మెరుగు పడితే వ్యవసాయరంగంలోకి అధిక పెట్టుబడులు సమకూరుతాయి. ఎక్కువ ధర రైతులకు మేలు చేస్తుంది కనక వారు నాణ్యతను, దిగుబడిని పెంచడానికి ఉత్సాహం చూపుతారు. సాంకేతికతను, కాంట్రాక్టు వ్యవసాయ విధానాన్ని ఆమోదిస్తారు. ఇది అన్ని రకాలుగానూ లాభదాయకమైందే.

అయితే పోటీ సవ్యంగా, సమర్ధంగా ఉండేట్టు చూసి గుత్త వ్యాపారాన్ని అరికట్టాలి. కొరత ఉన్నప్పుడు తప్ప చిల్లర దుకాణాల నిర్వాహకులు స్వదేశీ సరుకు మాత్రమే సేకరించేట్టు జాగ్రత్త పడాలి. వంటనూనెల వంటి వాటి విషయంలో దిగుమతులు అనివార్యం అయితే స్థానిక ఉత్పత్తిని ప్రోత్సహించడానికి, ధరలను దృష్టిలో ఉంచుకుని కస్టమ్స్ సుంకాన్ని హేతుబద్ధంగా నిర్ణయించాలి. పరిశ్రమల విషయంలో అయితే అవి చిన్న, మధ్యతరహా పరిశ్రమల నుంచి 30 శాతం కొనుగోలు చేసి తీరాలన్న నియమం ఉంది.

చిల్లర వ్యాపారం భారీ సంఖ్యలో ఇప్పుడు ఉపాధి కల్పిస్తోందన్న వాదన ఉంది. ఈ రంగంలో మూడు కోట్ల మంది అంటే మొత్తం జనభాలో ఏడు నుంచి ఎనిమిది శాతం మంది ఆధారపడి ఉన్నారు. అయితే ఈ చిల్లర దుకాణాల్లో పని చేసే వారికి వచ్చే ఆదాయం చాలా స్వల్పం. వీరిలో పదిశాతం మంది మాత్రమే పెద్ద నగరాల్లో పని చేస్తారు. ఈ నగరాల్లోనే విదేశీ చిల్లర వ్యాపార సంస్థలను అనుమతిస్తున్నారు. ఇలాంటి నగరాలలో దాదాపు 30 లక్షల మంది చిల్లర దుకాణాల్లో పనిచేస్తున్నారు. భారీ స్థాయిలో వరస చిల్లర దుకాణాలు నెలకొనడం వల్ల ప్రతి ఏటా 1.7 శాతం చిల్లర దుకాణాలు ఆ పోటికీ తట్టుకోలేక మూత పడుతున్నాయి. అంటే పెద్ద నగరాల్లో 51,000 మందికి విదేశీ చిల్లర దుకాణాల వల్ల ఉపాధి దొరక్కుండా పోవచ్చు.

విదేశీ చిల్లర దుకాణాల వల్ల వచ్చే అయిదేళ్ల కాలంలో 15 లక్షల మందికి ప్రత్యక్షంగా ఉపాధి దొరుకుతుందని అంచనా, రవాణా, మౌలిక సదుపాయాలు, మూల్యవర్ధనం వంటి రంగాలలో మరో 15 లక్షల మందికి ఉపాధి దొరకొచ్చు. చిన్న వ్యాపారులకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పించవచ్చు. మన విధానం ఇలాంటి రక్షణలు కల్పించాలి. ఈ పరివర్తనా కాలంలో చిన్నపాటి చిల్లర దుకాణాల స్థాయి పెంచాలి. ఫ్రాంచైజీలను, సహకార వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ఎన్‌డిడిబి లాంటి వ్యవస్థలను ఏర్పాటు చేయాలి.

చిల్లర వ్యాపారం ఏటా 13.3 శాతం (CAGR 2006–10) చొప్పున పెరుగుతోంది. ఆధునిక చిల్లర వ్యాపారం ఏటా 25శాతం చొప్పున పెరుగుతుందని అంచనా. చిన్నస్థాయి చిల్లర వ్యాపారం ఏటా 10 శాతం లేదా అంతకన్నా కొంచెం ఎక్కువగా పెరుగుతుంది. అంటే పెద్ద నగరాల్లో కూడా విదేశీ చిల్లర వ్యాపార సంస్థలు వచ్చినా 75శాతం వ్యాపారం చిల్లర వ్యాపారుల చేతిలోనే ఉంటుంది. అయిదేళ్ల కాలంలో చిల్లర వ్యాపారం రెట్టింపు అవుతుంది. చిన్న స్థాయి చిల్లర వ్యాపారం 50శాతం పెరుగుతుంది. అత్యంత అనుకూలమైన పరిస్థితుల్లో కూడా తూర్పు ఆసియా దేశాల్లో వ్యవస్థీకృత చిల్లర వ్యాపారం 25 నుంచి 30 శాతం మించి పెరగలేవని అనుభవ పూర్వకంగా తేలింది. ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడం, ఈ వ్యాపార నిర్వహణకు చేసే ఏర్పాట్ల వల్ల అసలు ప్రయోజనం సమకురుతుంది.

మరో అంశం దేశంలో పెట్టుబడులు, అభివృద్ధిరేటు. 2002లో మన పొదుపు రేటు డిజిపిలో 23 శాతం ఉంటే 2008లో అది 37శాతానికి పెరిగింది. 2011లో 32 శాతంకు తగ్గింది. దశాబ్ద కాలంగా కుటుంబాల పొదుపు 22శాతం దగ్గర నిలకడగా ఉంటే కార్పొరేట్ సంస్థల, ప్రభుత్వ పొదుపు తగ్గింది. అభివృద్ధి పుంజుకోవడంలో పెట్టుబడి సమకూరడానికీ ప్రధాన పాత్ర. పెట్టుబడికి కటకటగా ఉన్న దేశంలో ఎఫ్‌డిఐ వల్ల అభివృద్ధికి ప్రోత్సాహం లభిస్తుంది.

చివరగా మన కరెంట్ అకౌంట్ లోటు దాదాపు 78.2 బిలియన్ డాలర్లు ఉంది. అంటే ఇది జిడిపిలో 4.4శాతం. మనకున్న విదేశీ మారక ద్రవ్య నిల్వల ఆధారంగా ఈలోటు భరించడం కష్టం. విదేశాలనుంచి డబ్బు సమకూరడం, విదేశీ వ్యవస్థాపరమైన

పెట్టుబడులు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వల్లే ఈ లోటు పూడ్చగలం. ప్రవాస భారతీయులు మన దేశంలోని ఏటా 50 బిలియన్ డాలర్లు పంపిస్తున్నారు. ఈ మొత్తం స్థిరంగా కొనసాగుతోంది. పెట్టుబడి మార్కెట్ పుంజుకుంటే విదేశీ సంస్థాగత పెట్టుబడులూ పెరుగుతాయి. కాని ఈ డబ్బు మన దేశంలో స్థిరంగా ఉంటుందని చెప్పలేం. మన దేశంలో కానీ, మరెక్కడైనా గానీ ఇబ్బంది ఎదురైతే ఆ పెట్టుబడి మాయం అవుతుంది. మనకు ప్రత్యేక్ష విదేశీ పెట్టుబడుల రూపంలో స్థిరమైన, దీర్ఘకాలికమైన పెట్టుబడులు అవసరం. దానితో పాటు సాంకేతికత సమకూరుతుంది. అభివృద్ధి, ఉపాధి, ఆదాయాలు పెరుగుతాయి.

మొత్తం మీద చూస్తే చిల్లర వ్యాపారంలో ప్రత్యక్ష విదేశీ పెట్టుబడిని జాగ్రత్తగా సమకూర్చుకోగలిగితే అన్ని రకాలుగా ప్రయోజనం ఉంటుంది. అయితే విస్తృతం, వైవిధ్యభరితం అయిన భారత్ లాంటి ఆర్థిక వ్యవస్థలో సత్వర పరిష్కారాలు, సర్వరోగ నివారిణులకు అవకాశం ఉండదు. ■



1.07.2013

Annexure

**statement sowing Minimum Support Prices Recommended by CACP and Fixed by Government for different commodities**

| Commodity | 2007-2008 | | 2008-2009 | | 2009-2010 | | 2010-11 | | 2011-12 | | 2012-13 | | 2013-14 | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | Reco | Fixed | Reco | Fixed | Reco | Fixed | Reco | Fixed | Reco | Fixed | Reco | Fixed | Reco | Fixed |
| Paddy Common | 645 | 645 | 1000 | 850 | 950 | 950 | 1000 | 1000 | 1080 | 1080 | 1250 | 1250 | 1310 | 1310 |
| Paddy (F)/Grade'A'# | 675 | 675 | 1050 | 880 | 980 | 1030 | 1030 | 1030 | 1110 | 1110 | | 1280 | 1345 | 1345 |
| Jowar-Hybrid | 600 | 600 | 840 | 840 | 840 | 840 | 880 | 880 | 980 | 980 | 1500 | 1500 | 1500 | 1500 |
| Jowar-Maldandi | 620 | 620 | 860 | 860 | 860 | 860 | 900 | 900 | 1000 | 1000 | | 1520 | 1520 | |
| Bajra | 600 | 600 | 840 | 840 | 840 | 840 | 880 | 880 | 980 | 980 | 1175 | 1175 | 1175 | 1310 |
| Ragi | 600 | 600 | 915 | 915 | 915 | 915 | 965 | 965 | 1050 | 1050 | 1500 | 1500 | 1500 | 1500 |
| Maize | 620 | 620 | 840 | 840 | 840 | 840 | 880 | 880 | 980 | 980 | 1175 | 1175 | 1310 | 1310 |
| Tur (Arhar) | 1550 | 1550 | 2000 | 2000 | 2300 | 2300 | 2800 | 3000 | 3100 | 3200 | 4000 | 3850 | 3850 | 4300 |
| Moong | 1700 | 1700 | 2520 | 2520 | 2760 | 2760 | 3170 | 3170 | 3400 | 3500 | 4500 | 4400 | 4500 | 4500 |
| Urad | 1700 | 1700 | 2520 | 2520 | 2520 | 2520 | 2900 | 2900 | 3300 | 3300 | 4300 | 4300 | 4300 | 4300 |
| Groundnut | 1550 | 1550 | 2100 | 2100 | 2100 | 2100 | 2300 | 2300 | 2700 | 2700 | 3700 | 3700 | 4000 | 4000 |
| Sunflower Seed | 1510 | 1510 | 2215 | 2215 | 2215 | 2215 | 2350 | 2350 | 2800 | 2800 | 3700 | 3700 | 3700 | 3700 |
| Soyabean Black | 910 | 910 | 1350 | 1350 | 1350 | 1350 | 1400 | 1400 | 1650 | 1650 | 2200 | 2200 | 2500 | 2500 |
| Soyabean Yellow | 1050 | 1050 | 1390 | 1390 | 1390 | 1390 | 1440 | 1440 | 1690 | 1690 | | | 2560 | 2560 |
| Sesamum | 1580 | 1580 | 2750 | 2750 | 2850 | 2850 | 2900 | 2900 | 3400 | 3400 | 4200 | 4200 | 4500 | 4500 |
| Nigerseed | 1240 | 1240 | 2405 | 2405 | 2405 | 2405 | 2450 | 2450 | 2900 | 2900 | 3500 | 3500 | 3500 | 3500 |
| Cotton (F414/H777/J 34 (Raj.) | 1800 | 1800 | 2500 | 2500 | 2500 | 2500 | 2500 | 2500 | 2800 | 2800 | 3600 | 3600 | 3700 | 3700 |
| Cotton H-4 /S-6 (Bunny/Brahma from 08-09) | 2030 | 2030 | 3000 | 3000 | 3000 | 3000 | 3000 | 3000 | 3300 | 3300 | 3900 | 3900 | 4000 | 4000 |
| Wheat | 700 | 750 | 1000 | 1000 | 1080 | 1080 | 1100 | 1100 | 1120 | 1120 | 1285 | 1285 | 1285 ‡ | 1350 |
| Barley | 565 | 565 | 650 | 650 | 680 | 680 | 750 | 750 | 780 | 780 | 980 | 980 | 980 | 980 |
| Gram | 1445 | 1445 | 1600 | 1600 | 1730 | 1730 | 1760 | 1760 | 2100 | 2100 | 2800 | 2800 | 3000 | 3000 |
| Lentil (Masur) | 1545 | 1545 | 1700 | 1700 | 1870 | 1870 | 1870 | 1870 | 2250 | 2250 | 2800 | 2800 | 2900 | 2900 |
| Rapeseed/ mustard | 1800 | 1715 | 1800 | 1800 | 1830 | 1830 | 1830 | 1830 | 1850 | 1850 | 2500 | 2500 | 3000 | 3000 |
| Safflower | 1565 | 1565 | 1650 | 1650 | 1650 | 1650 | 1680 | 1680 | 1800 | 1800 | 2500 | 2500 | 2800 | 2800 |
| Jute (TD5)* | 1055 | 1055 | 1250 | 1250 | 1375 | 1375 | 1575 | 1575 | 1675 | 1675 | 2200 | 2200 | 2300 | 2300 |
| Sugarcane | 81.18 | 81.18 | 81.18 | 81.18 | 129.84 | 129.84 | 139.12 | 139.12 | 145.00 | 145.00 | 170.00 | 170.00 | 210.00 | 210.00 |
| Copra @ Milling | 3620 | 3620 | 3660 | 3660 | 4450 | 4450 | 4450 | 4450 | 4525 | 4525 | 5100 | 5100 | 5100 | 5250 |
| Copra @ Ball | 3870 | 3870 | 3910 | 3910 | 4700 | 4700 | 4700 | 4700 | 4775 | 4775 | 5350 | 5350 | 5350 | 5500 |

( p+) : Additional incentive bonus of Rs. 100.00 per quintal for paddy for 2007-08 entire Kharif marketing season (Rs. 50/- Notification
(a+) An additional incentive bonus of Rs. 100/- per quintal is payable on Procurement during rabi marketing season 2007-08.This will be Subject to the condition that state Government fully exempt this bounus amount from all state taxes and levies.

## AREA UNDER FOOD AND NON-FOOD CROPS, DISTRICT-WISE, 2011-12

( Area In Hectares)

| Sl. No. | District | Food Crops | Non-food Crops | Total |
|---|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) | (5) |
| 1. | Srikakulam | 3,58,497 | 69,764 | 4,28,261 |
| 2. | Vizianagaram | 2,93,829 | 85,406 | 3,79,235 |
| 3. | Visakhapatnam | 3,07,803 | 52,670 | 3,60,473 |
| 4. | East Godavari | 5,41,585 | 94,779 | 6,36,364 |
| 5. | West Godavari | 5,89,755 | 1,05,057 | 6,94,812 |
| 6. | Krishna | 6,17,997 | 1,08,439 | 7,26,436 |
| 7. | Guntur | 5,96,820 | 2,32,492 | 8,29,312 |
| 8. | Prakasam | 3,99,161 | 2,37,272 | 6,36,433 |
| 9. | S.P.S Nellore | 3,73,295 | 75,297 | 4,48,592 |
| 10. | Chittoor | 2,38,081 | 1,70,267 | 4,08,348 |
| 11. | Y.S.R | 2,69,677 | 1,63,293 | 4,32,970 |
| 12. | Anantapur | 2,88,925 | 8,25,158 | 11,14,083 |
| 13. | Kurnool | 5,97,997 | 3,64,193 | 9,62,190 |
| 14. | Mahbubnagar | 5,82,886 | 3,80,350 | 9,63,236 |
| 15. | Ranga Reddy | 2,01,539 | 60,538 | 2,62,077 |
| 16. | Hyderabad | - | - | - |
| 17. | Medak | 4,80,912 | 1,18,932 | 5,99,844 |
| 18. | Nizamabad | 4,48,508 | 1,15,281 | 5,63,789 |
| 19. | Adilabad | 2,15,072 | 4,24,967 | 6,40,039 |
| 20. | Karimnagar | 5,28,317 | 2,52,400 | 7,80,717 |
| 21. | Warangal | 3,76,771 | 2,93,106 | 6,69,877 |
| 22. | Khammam | 3,06,999 | 2,09,030 | 5,16,029 |
| 23. | Nalgonda | 4,69,992 | 2,36,265 | 7,06,257 |
| | ANDHRA PRADESH | 90,84,418 | 46,74,956 | 1,37,59,374 |

## AVERAGE YIELD PER HECTARE, AREA AND OUT-TURN OF PRINCIPAL CROPS 2011-12

| Sl. No. | Crop | Region | Area under the crops (In Hectares) | Production (In Tonnes) | Estimated Average Yield (In Kgs. per Hectare) |
|---|---|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) | (5) | (6) |
| 1. | Rice | Coastal Andhra | 20,85,908 | 69,16,588 | 3,316 |
| | | Rayalaseema | 2,60,392 | 8,27,587 | 3,178 |
| | | Telangana | 17,49,548 | 51,47,617 | 2,942 |
| | | **Andhra Pradesh** | **40,95,848** | **1,28,91,792** | **3,148** |
| 2. | Jowar | Coastal Andhra | 35,171 | 1,59,564 | 4,537 |
| | | Rayalaseema | 1,12,986 | 1,92,498 | 1,704 |
| | | Telangana | 1,28,441 | 1,44,171 | 1,122 |
| | | **Andhra Pradesh** | **2,76,598** | **4,96,233** | **1,794** |
| 3. | Bajra | Coastal Andhra | 16,807 | 29,689 | 1,766 |
| | | Rayalaseema | 15,013 | 21,855 | 1,456 |
| | | Telangana | 11,343 | 7,100 | 626 |
| | | **Andhra Pradesh** | **43,163** | **58,644** | **1,359** |
| 4. | Maize | Coastal Andhra | 2,07,823 | 14,78,282 | 7,113 |
| | | Rayalaseema | 64,552 | 2,84,922 | 4,414 |
| | | Telangana | 5,91,349 | 18,92,475 | 3,200 |
| | | **Andhra Pradesh** | **8,63,724** | **36,55,679** | **4,232** |
| 5. | Ragi | Coastal Andhra | 29,528 | 23,002 | 779 |
| | | Rayalaseema | 10,712 | 14,972 | 1,398 |
| | | Telangana | 2,196 | 2,798 | 1,274 |
| | | **Andhra Pradesh** | **42,436** | **40,772** | **961** |
| 6. | Total Major and Small Millets | Coastal Andhra | 3,06,970 | 17,01,753 | 5,544 |
| | | Rayalaseema | 2,14,414 | 5,21,420 | 2,432 |
| | | Telangana | 7,33,528 | 20,46,675 | 2,790 |
| | | **Andhra Pradesh** | **12,54,912** | **42,69,848** | **3,403** |
| 7. | Redgram | Coastal Andhra | 64,987 | 34,623 | 533 |
| | | Rayalaseema | 1,17,876 | 20,759 | 176 |
| | | Telangana | 2,98,635 | 90,706 | 304 |
| | | **Andhra Pradesh** | **4,81,498** | **1,46,088** | **303** |

(Contd.)

## AVERAGE YIELD PER HECTARE, AREA AND OUT-TURN OF PRINCIPAL CROPS 2011-12

| Sl. No. | Crop | Region | Area under the crops (In Hectares) | Production (In Tonnes) | Estimated Average Yield (In Kgs. per Hectare) |
|---|---|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) | (5) | (6) |
| 8. | Total Pulses | Coastal Andhra | 7,91,296 | 6,20,130 | 784 |
| | | Rayalaseema | 5,20,471 | 3,12,530 | 600 |
| | | Telangana | 6,18,120 | 2,96,299 | 479 |
| | | **Andhra Pradesh** | **19,29,887** | **12,28,959** | **637** |
| 9. | Chillies | Coastal Andhra | 1,31,386 | 5,11,891 | 3,896 |
| | | Rayalaseema | 27,244 | 58,225 | 2,137 |
| | | Telangana | 89,634 | 2,34,088 | 2,612 |
| | | **Andhra Pradesh** | **2,48,264** | **8,04,204** | **3,239** |
| 10. | Tamarind | Coastal Andhra | 469 | 2,079 | 4,433 |
| | | Rayalaseema | 4,508 | 17,718 | 3,930 |
| | | Telangana | 837 | 5,982 | 7,147 |
| | | **Andhra Pradesh** | **5,814** | **25,779** | **4,434** |
| 11. | Sugarcane | Coastal Andhra | 1,28,056 | 10,20,133 | 7,966 |
| | | Rayalaseema | 30,535 | 2,81,074 | 9,205 |
| | | Telangana | 45,447 | 3,89,499 | 8,570 |
| | | **Andhra Pradesh** | **2,04,038** | **16,90,706** | **8,286** |
| 12. | Onion | Coastal Andhra | 4,584 | 86,293 | 18,825 |
| | | Rayalaseema | 35,664 | 5,37,568 | 15,073 |
| | | Telangana | 16,743 | 3,75,888 | 22,450 |
| | | **Andhra Pradesh** | **56,991** | **9,99,749** | **17,542** |
| 13. | Groundnut | Coastal Andhra | 77,305 | 1,38,990 | 1,798 |
| | | Rayalaseema | 10,58,370 | 4,43,594 | 419 |
| | | Telangana | 1,71,361 | 2,62,037 | 1,529 |
| | | **Andhra Pradesh** | **13,07,036** | **8,44,621** | **646** |
| 14. | Total Oil Seeds | Coastal Andhra | 2,19,605 | 12,00,657 | 5,467 |
| | | Rayalaseema | 13,26,488 | 5,42,092 | 409 |
| | | Telangana | 4,48,355 | 5,87,922 | 1,311 |
| | | **Andhra Pradesh** | **19,94,448** | **23,30,671** | **1,169** |

## AREA IRRIGATED BY SOURCES, DISTRICT-WISE, 2011-12

(In Hectares)

| Sl. No. | District | Net Area Irrigated by | | | | | | Area Irrigated more than once | Gross Area Irrigated |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | Tanks | Canals | Tube-wells | Dug Wells | Other Sources | Total | | |
| (1) | (2) | (3) | (4) | (5) | (6) | (7) | (8) | (9) | (10) |
| 1. | Srikakulam | 65,769 | 1,12,894 | 4,538 | 5,647 | 2,814 | 1,91,662 | 28,229 | 2,19,891 |
| 2. | Vizianagaram | 80,720 | 41,930 | 13,878 | 5,399 | 5,064 | 1,46,991 | 31,797 | 1,78,788 |
| 3. | Visakhapatnam | 30,993 | 48,507 | 9,604 | 5,074 | 22,964 | 1,17,142 | 29,365 | 1,46,507 |
| 4. | East Godavari | 23,871 | 1,81,165 | 62,503 | 37 | 16,016 | 2,83,592 | 1,51,232 | 4,34,824 |
| 5. | West Godavari | 18,161 | 1,78,762 | 1,71,985 | 2,663 | 7,708 | 3,79,279 | 2,18,937 | 5,98,216 |
| 6. | Krishna | 29,082 | 2,19,428 | 59,824 | 3,080 | 11,826 | 3,23,240 | 51,993 | 3,75,233 |
| 7. | Guntur | 5,552 | 3,48,719 | 72,000 | 4,828 | 21,134 | 4,52,233 | 74,615 | 5,26,848 |
| 8. | Prakasam | 12,360 | 83,811 | 1,16,594 | 3,835 | 15,821 | 2,32,421 | 12,480 | 2,44,901 |
| 9. | S.P.S Nellore | 70,783 | 96,889 | 79,681 | 12,494 | 5,124 | 2,64,971 | 70,334 | 3,35,305 |
| 10. | Chittoor | 16,531 | 5,685 | 1,07,185 | 16,690 | 106 | 1,46,197 | 46,600 | 1,92,797 |
| 11. | Y.S.R | 3,892 | 21,758 | 1,29,983 | 4,168 | 887 | 1,60,688 | 35,698 | 1,96,386 |
| 12. | Anantapur | 898 | 22,836 | 1,11,525 | 5,579 | 1,548 | 1,42,386 | 29,546 | 1,71,932 |
| 13. | Kurnool | 8,264 | 1,30,156 | 86,379 | 26,400 | 13,239 | 2,64,438 | 34,404 | 2,98,842 |
| 14. | Mahbubnagar | 3,346 | 31,058 | 2,09,093 | 4,169 | 8,572 | 2,56,238 | 73,979 | 3,30,217 |
| 15. | Ranga Reddy | 2,208 | 765 | 68,499 | 4,325 | 1,188 | 76,985 | 21,745 | 98,730 |
| 16. | Hyderabad | - | - | - | - | - | - | - | - |
| 17. | Medak | 6,549 | 2,776 | 1,38,298 | 7,154 | 2,695 | 1,57,472 | 82,667 | 2,40,139 |
| 18. | Nizamabad | 12,145 | 47,182 | 1,45,027 | 2,797 | 6,905 | 2,14,056 | 1,84,398 | 3,98,454 |
| 19. | Adilabad | 15,981 | 11,790 | 36,410 | 17,060 | 1,582 | 82,823 | 28,772 | 1,11,595 |
| 20. | Karimnagar | 26,697 | 78,571 | 52,898 | 1,96,067 | 110 | 3,54,343 | 2,31,649 | 5,85,992 |
| 21. | Warangal | 56,176 | 12,264 | 98,753 | 1,68,377 | 3,196 | 3,38,766 | 1,09,203 | 4,47,969 |
| 22. | Khammam | 43,299 | 64,875 | 48,897 | 33,085 | 15,983 | 2,06,139 | 36,713 | 2,42,852 |
| 23. | Nalgonda | 16,301 | 76,036 | 1,67,616 | 24,734 | 13,109 | 2,97,796 | 1,10,297 | 4,08,093 |
| ANDHRA PRADESH | | 5,49,578 | 18,17,857 | 19,91,170 | 5,53,662 | 1,77,591 | 50,89,858 | 16,94,653 | 67,84,511 |


వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు


వ్యవసాయ ఉత్పత్తుల గ్రేడింగ్
>more




ధాన్యం అమ్ముకునే స్వేచ్ఛ కోసం ...
ఆంక్షల్ని ఉల్లంఘించి ఉద్యమించిన
డా॥ జయప్రకాష్ నారాయణ్